# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకట రత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు
డా॥ యమ్ స్వర్ణముఖి

సంపుటి 33 సంచిక 2
పేజీలు 48
అక్టోబర్ 2013

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన
చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

***ఈ సంచికలో*** .............................. ....... ***పేజీ***

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| యోగవాశిష్ఠము | 12 |
| శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు | 15 |
| గురు కృపాహి కేవలమ్ | 17 |
| గణపతి | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 21 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 22 |
| సర్వము నీ దయ | 25 |
| సమర్థ సద్గురు పబ్లికేషన్స్ | 27 |
| మహంకాళిదేవి ప్రతిష్ఠ | 29 |
| భగవానుడు మనకెంత దూరం? | 32 |
| కృష్ణా మా యింటికి రావో | 34 |
| శ్రీకృష్ణజన్మాష్టమి స్వర్ణోత్సవ నివేదిక | 36 |
| శ్రీకృష్ణుని బాల లీలలు | 40 |
| శ్రీరామలింగేశ్వరుని లీల | 41 |
| శ్రీరాధామాధవ రససుధ | 42 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 43 |
| విష్ణు కథలు | 47 |

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అమాత్రాశ్చతుర్థో వ్యవహార్యః ప్రపంచ్నోప శమః ।
శివోద్వైతయేవ మోంకారఆత్మైవ సంవిశత్యాత్మనాత్మానం యఏవం వేద
మాండ్యూకోపనిషత్తు 12శ్లో

మాత్రా రహితమైన ఓంకారం తురీయం ఆత్మస్వరూపమే. చిత్తాన్ని ఓంకారంలో సమాహితం చేయాలి. నిత్యము ఓంకార సమాహిత చిత్తులైన వారు నిర్భయులే. ఆత్మతత్వం అద్వైత భావం. అది శివస్వరూపము. మంగళ కరము. జాగ్రదావస్థ, స్వప్నంలో అద్వయ మనస్సే ద్వైతరూపంగా భాసించి, మానసిక ద్వైతస్థితికి కారణమవుతోంది. మనసు సంకల్ప శూన్యమైనప్పుడు ద్వైత స్థితి ఉండదు కదా.



ఆత్మయే సత్యమని దృఢభావన కలిగినప్పుడు మనసు అమనస్కమవుతుంది. ఉన్నది యింకొక విధంగా గ్రహించటమే స్వప్నం. యదార్థాన్ని తెలియకుండుటయే నిదుర. ఈ రెండు స్థితులు అధిగమించిన స్థితియే తురీయం. ఆ స్థితిలో ప్రపంచం నివృత్తమవుతుంది. చిత్తాన్ని ఓంకారంలో సమాహితం చేస్తే, ఓంకార బ్రహ్మాపదం సాధించవచ్చు. ఓంకారమే పరబ్రహ్మము, అవ్యయము, క్రియారహితము. ప్రణవాన్ని యీ విధంగా తెలుసుకున్నవాడు తద్రూపాన్నే పొందుతాడు.

ఓంకారం పదార్థంగాని, వస్తువుగాని కాదు. శబ్దం అంతకన్న కాదు. అది మనసుకి, బుద్ధికి, యింద్రియాలకి అందేది కాదు. అది కేవలం అనుభూతి. ఓంకారనాదం ఆనందానుభూతి. వ్యక్తంగా, అవ్యక్తంగా ఉన్న సమస్తము ఓంకారమే. అది ఆత్మకి భిన్నంగా లేదు అనే అనుభూతిని పొందినవారే మునులు.

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

తన్నుజూచి యొరులు తగ మెచ్చవలెనని
సొమ్ములెఱవుదెచ్చి నెమ్మిమీఱ
నొరలకొరకు తానె యుబ్బుచునుండును
విశ్వదాభిరామ! వినురవేమ!



తాత్పర్యము -

మూర్ఖులు తమ్ము యితరులు చూసి మోచ్చకొన వలెనని ఎరువు సొమ్ములు తెచ్చి ధరింతురు. ఒరులు మెచ్చకున్నను తామేతమ్ము మెచ్చుకొనుచుందురు.

తలదాఁకినపుడు తలఁతురు
తలక్రింద్దైపడినయపుడు తలఁపరు శివునిన్
పలుగాకు లిలను సాజము
కలనాఁడెన్నరె యదేమి కర్మమొ వేమా!

తాత్పర్యము -

దుష్టులు తమ కాపద కలిగినప్పుడు భగవంతుని స్మరింతురు. లేనప్పుడు తలంపనే తలంపరు. ఇది సహజము. తమకు సంపద కలిగినప్పుడు దేవుడు స్మరణకు రాడు. ఇది వింత!

తల్లి యున్నయపుడె తనదు గారాబము
లామె పోవఁ దన్ను నరయ రెవరు
మంచికాలమపుడె మర్యాద నార్జింపు
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము -

తల్లి బతికి యున్నపుడే ముద్దు ముచ్చటలు. ఆమె చనిపోయినచో ఎవరూ గమనింపరు. అటులే కాలము బాగుగా ఉన్నపుడె గౌరవమును సంపాదించ వలెను.

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ మానవులు మహాత్ములను అపార్థం చేసుకుంటారు. వారు ఎక్కడో ముక్కుమూసుకుని కూర్చునేబదులు సృష్టిలో సంభవించే వైపరీత్యాలను నివారించవచ్చు కదా! అని అనుకోవడం సహజమే. భగవానుడు మానవుని సృష్టించి, వివేకవంతుడవై ప్రవర్తించమని బుద్ధి, తన జీవిత పరమార్థమేమిటో తెలుసుకొనటానికి మనస్సు, జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను ప్రసాదించాడు. వాటిని సక్రమంగా వినియోగించుకోమన్నాడు. మహాత్ములు ఎప్పటికప్పుడు హెచ్చరిక చేస్తూనే ఉంటారు. కాని, మానవుడు దానిని పెడచెవిని పెట్టి సంకటములకు గురి అవుతున్నాడు.



శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ, ఒక దీపం ఉంది. దాని వెలుగుని మానవులందరూ ఒకే విధంగా వినియోగించుకోరు కదా! కొంతమంది ఆ దీపకాంతిని భాగవత ప్రవచనానికో, సత్సంగానికో, శుభకార్యానికో, భగవంతుని సేవకో వినియోగించుకోవచ్చు. మరికొంతమంది ఆ దీప కాంతిని చతుర్ముఖ పురాణానికో లేక ఇతర దుష్కార్యములకో ఉపయోగించుకోవచ్చు! దానికి తప్పు ఎవరిది? ఆ దీపానిది కాదుగా! అది వారి వారి సంస్కారముల మీద ఆధారపడి ఉంటుంది. మరి ఈ సంస్కార హీనత రహితం అయ్యేమార్గం లేదా? ఉంది! కాని, మార్గాన్ని సూచించినా దాన్ని ఆచరించేవారు ఎంతమంది? అందువలననే వేమనగారు "హీనుడా గుణంబు మానునా, బొగ్గు పాలగడుగ పోవునా మలినంబు" అని అన్నారు. మానవుడు మహాత్ముల బోధను పెడచెవిని పెట్టి, తన మనస్సు ఎలా ప్రభోదిస్తే అలా సంచరిస్తాడు. చివరికి వట్టి చేతులతో మట్టిపాలై జనన, మరణ విషవలయంలో చిక్కుకుంటాడు. దీనికి మహాత్ముల బాధ్యత ఎంతవరకు?"

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ, "మీకొక సంఘటన చెబుతాను. కొలది క్షణముల క్రితమే నాకొక ఫోన్‌కాల్ వచ్చింది. తన అన్నగారి కుమారుడు ప్రమాద స్థితిలో నున్నట్లు తెలియచేసి సహాయం చేయమని

అర్థించాడు. నేను వెంటనే సమాధానం చెప్తూ ఆశ్రమంలో అమ్మగదికి వెళ్లి, నమస్కారం చేసుకుని తీర్థప్రసాదాలు తీసుకోమన్నాను. వారికి నా మాటయందు విశ్వాసం ఉండాలి కదా! వారికి విశ్వాసం ఉండటం, లేకపోవటం వారి వారి సంస్కారముల ననుసరించి ఉంటుంది. నా సలహాని వారు పెడచెవిని పెట్టారు. నా తప్పేమీలేదుకదా! ఫోన్ చేసిన వ్యక్తి భక్తుడే! మన శిష్యుడే! కాని, వారి అన్నగారికి నామాటయందు విశ్వాసం ఉండాలి కదా!".

ఒక భక్తుడు సహాయం కోరినపుడు, మహాత్ములుగా మీరు సహాయం చేయవచ్చుగదా అని నన్ను మీరు ప్రశించవచ్చు.

సగుణబ్రహ్మకు కొన్ని ఇబ్బందులుంటాయి. అది దేవ రహస్యం. మీరంతా చదువుకున్నవారు, మీ సబ్జెక్ట్ ఫిజిక్స్, బోటనీ. నా సబ్జెక్ట్ వేరు. అది మీకు చెప్పినా అర్థంకాదు. విధి నిర్ణయాన్ని ఎవరూ తప్పించలేరు. ఇంకా మాట్లాడుతూ "విధి అంటే భగవంతుడే కదా!" అవతారపురుషులైన సద్గురు మూర్తికి భగవంతునికి తేడా లేదుకదా!" అని మీరు ప్రశ్నించవచ్చు. అది కరెక్టే కాని విధినిర్ణయం అనేది నువ్వాచరించే కర్మననుసరించి ఉంటుంది. కర్మను ఆచరించేవాడు భక్తుడైతే అది రహితం అవటానికి అవకాశం ఉంది. ఇక్కడ మనం ప్రస్తుతం చర్చించే విషయంలో సహాయము కోరిన వాడు భక్తుడు కాని కర్మను అనుభవించేవాడు భక్తుడు కాదుకదా! నువ్వు అన్నం తిని ఇంకొకడి కడుపు నిండమంటే ఎలాగయ్యా?"

భక్తికీ, భయానికీ తేడా ఉంది. భక్తి వినయ విధేయతలతో కూడినది. ప్రేమతో కూడినది. నిష్కళంకమైనది. కోరికలేనిది. భక్తి అన్నా విశ్వాసం అన్నా, ప్రేమ అన్నా ఒకటే.

భయము అనేది కోరికలతో కూడినది. భయముతో కలిగిన ప్రేమ భయ రహితము అవగానే పోతుంది. అది అశాశ్వతమైనది. దీనిని అర్థం చేసుకోండి చాలు!" అని అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

*

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

(గతసంచిక తరువాయి)

ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు లీనమై
ఎవ్వనియందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్య లయుడెవ్వడు సర్వము తానైయన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్ - భాగవతము

మొసలివాత పడిన గజేంద్రుడు నారాయణుని ఆ విధంగా ప్రార్థించాడు. ముందుగా తన వేలాది భార్యలని, పరివారాన్ని ప్రార్థించాడు. వారిలో ఒక్కరు కూడా ఆయనని రక్షించటానికి ముందుకు రాలేదు సరికదా, అక్కడే ఉంటే తమకేమి ముప్పు వస్తుందోనని పలాయనం చిత్తగించారు. గజరాజుకి దిక్కుతోచలేదు. నా వాళ్ళు అనుకున్న వాళ్ళంతా వెళ్ళిపోయారు! ఇక ఎవరు దిక్కు? అప్పుడు ఆయన మదిలో నారాయణుడు తళుక్కున మెరిశాడు. అన్నిటికీ మూలకారణమైన శక్తిని ఆరాధించాడు. తత్ క్షణమే ఆ మూలకారణ శక్తి నారాయణ రూపం ధరించి వచ్చి, మొసలిని సంహరించి, గంజేంద్రునికి మోక్షాన్ని ప్రసాదించింది. అటువంటి దృఢ నిశ్చయం కలిగి ఉండాలని భగవద్గీత మనకి బోధిస్తోంది. భగవంతునికి ఇష్టమైన లక్షణాలు ఏమిటో భగవద్గీత 12వ అధ్యాయం - భక్తియోగంలో సవిస్తారంగా చెప్పబడ్డాయి.




ప్రాపంచిక విషయాలలో మనకి చాలా దృఢమైన నిశ్చయముంటోంది. జిలేబీ వేరు, జాంగ్రీ వేరు అంటాం. ఒకే మినప్పిండితో చేసినా, ఒక దానిని ఇడ్లీ అంటాం, మరొక దాన్ని కుడుము అంటాం. ఇటువంటి నిశ్చయాలు మనకి చాలా దృఢంగా పాతుకు పోయాయి. కానీ, మనని తరింపజేయటానికి వచ్చిన అనంత శక్తి స్వరూపమే గురుదేవుడు అన్న విషయంలో మాత్రము దృఢనిశ్చయం కలుగటం లేదు. అనంత శక్తి ఉన్నది అంటే అది గురుదేవుడే! ఈ సత్యాన్ని గుర్తించనీయకుండా మనకి మల, విక్షేప, ఆవరణ దోషాలనేవి అడ్డువస్తున్నాయి. తద్వారా గురుదేవుడికి అందనంత దూరం వెళ్ళిపోతున్నాము. ఈ మూడు దోషాలు దేహానికి రావటం లేదు. అవి మనసుకి పడుతున్నాయి.

జన్మజన్మాంతర వాసనలు మనలను 'మల' రూపంలో బాధిస్తున్నాయి. ఈ మలదోషం పోవటానికి భగవన్నామం అనుకుంటే చాలు. 'ఓం నమో నారాయణాయ',' 'ఓం గురురామ్', 'ఓం శ్రీమాత్రే నమః' ఏ ఒక్క నామమైనా అనుకుంటే చాలు మనని తరింప జేయటానికి. ఇవి అనుకోవటానికి మేళతాళాలు అక్కర్లేదు. మనకే బాధ వచ్చినా 'ఓం బాబు' అని అనుకుంటాం. నా చిన్నప్పుడు పాములు కనబడితే 'ఓం నమశ్శివాయ' అనుకొనేదాన్ని, ఎవరిలో ఏది నానుతుందో అదే బయటకి వస్తుంది. మనస్సు నిరంతరం భగవన్నామంలో ఓలలాడుతూ ఉంటే అదే బహిర్గతమవుతుంది.

కొంతమంది ఈ మలదోషాలు అసలు నాకే ఎందుకు వచ్చాయి? అని ప్రశ్నిస్తారు. మనం దారమ్మట వెడుతున్నాం. చూడకుండా అక్కడేదో అశుద్ధం ఉంటే దాని మీద కాలు వేశాం. అది కాలుకి అంటుకుంది. 'ఇది నా కాలుకే ఎందుకు అంటుకుంది? అబ్బా! ఎంత దుర్వాసనో! అది దేని తాలూకూ?' అని మొదలు పెడితే, ఆ వాసన పోదు సరికదా ఇంకా ఎక్కువ అవుతుంది. ఇలాంటి విచారణ చేస్తూ జాప్యం చేసే బదులు ఒక్కసారి నీటిపంపు దగ్గరకువెళ్ళి శుభ్రంగా కడిగేసుకుంటే ఆ మలం వదిలిపోతుంది కదా!

జన్మజన్మాంతరాలలో నీవు చేసిన కర్మల ఫలాలు వాసనల రూపంలో మలంగా నీ మనస్సుకి అంటుకుని నిన్ను బాధలకి గురి చేస్తున్నాయి. స్థూలదేహానికి అంటుకున్న మలాన్ని నీటితో కడిగేయవచ్చు. కానీ ఈ వాసనలు నీ కంటికి కనిపించని సూక్ష్మదేహమైన మనసుని పట్టి పీడిస్తున్నాయి. వాటిని కడిగివేసే శక్తి సూక్ష్మాతి సూక్ష్మమైన భగవన్నామానికే ఉంది. కనుక భగవన్నామం చేస్తే నీ మల దోషం హరిస్తుందని మహాత్ములు మన చెవులో యిల్లు కట్టుకుని బోధిస్తున్నారు.

ఇక రెండవది 'విక్షేప దోషం'. మనం నిక్షేపంలా చక్కగా పద్మాసనం వేసుకుని ధ్యాన ముద్రలోనే కూర్చోవచ్చు. కాని మనసు మాత్రం అది కాదని యిది, యిది కాదని అది అనేక విషయాలవైపు పరుగులు పెడుతూ ఈ ధ్యానానికి విక్షేపం కలిగిస్తుంది. ఈ చంచలమైన మనసును నిలబెట్టాలంటే మన వల్ల సాధ్యం కాదు. దానికి ఒకే ఒక్క ఉపాయం ఉంది. అదేమిటంటే మనం విన్న గురుబోధను మననం చేసుకుంటూ ఉంటే అదే విచారణలోకి జారుకుని, మనసు అందులో లయించిపోతుంది. అప్పుడు దాని కదలికకి

ఫుల్‌స్టాప్ పడుతుంది. ఈ విధంగా విక్షేపదోషాన్ని అధిగమించవచ్చు.

ఈ మల, విక్షేపాలు రెంటికీ ముత్తాత అయినది యింకొకటి ఉన్నది. అదే 'ఆవరణ దోషం'. ఈ దేహమే 'నేను' అని అనుకోవటమే అహంకారము. ఇది ఒక పెద్ద ఆవరణగా అయి మనకి మనలోపల ఉన్న చైతన్యము లేక ఆత్మని కనబడనీయకుండా చేస్తుంది. ఇది తొలగించుకోవాలంటే ఏం చేయాలి? ఇంతకు ముందుగానే చెప్పుకున్నట్లు కేవలం నిరంతర విచారణ మాత్రమే. మన సద్గురు నాధులు చెప్పినది మహాత్ములు, శాస్త్రాలు చెప్పినది సత్యమని గుర్తించి, నిరంతరం దానియందే రమిస్తూ, దానిలో లయించి పోవటమే దీనికి మందు. కేవలం గురువు అనుగ్రహం వలన మాత్రమే యీ ఆవరణ దోషం తొలగుతుంది. గురు అనుగ్రహం ఎప్పుడు కలుగుతుంది? అని మీరు ప్రశ్నించవచ్చు. గురుమూర్తి చెప్పింది చెప్పినట్లుగా మనం సాధన చేస్తూంటే ఆవరణ దోషం అంటే 'ఈ శరీరం నేను' అనే భావనను ఆయనే తొలగించి, మనకు స్వస్వరూప దర్శనం చేయిస్తారు.

మల విక్షేప ఆవరణ దోషాలు తొలగించుకోవటానికి మనం సాధన చతుష్టయ సంపదను సంపాదించుకోవాలి. వీటన్నిటిని నాలోనే ఉండి గుర్తిస్తూ సాక్షిగా ఉన్న శక్తి ఏదైతే ఉందో అది నా గురుదేవుడే అని ఆరూఢంగా గుర్తించాలి. ఒక రూపంగా చూస్తే ఆ శక్తిని 'గురుదేవుడు' అంటున్నాము. రూప నామ క్రియా రహితంగా చూస్తే వాస్తవానికి ఆ శక్తి తానే. ఈ మల విక్షేప ఆవరణ దోషాలను గుర్తించే మూలం గురుదేవుడని తెలుసుకోవాలి.

'మేము యివ్వాళ సత్సంగం చేసుకున్నామండీ' అని కొందరు అంటూ ఉంటారు. వారితో నేను యిలా అన్నాను – అయితే నువ్వు దుస్సంగం కూడా చేస్తావా? సాధకులు కలసుకున్నప్పుడు చేయవలసినది సత్సంగమే కదా. ఎవరూ లేకపోయినా ఆ సత్య వస్తువు నీలో ఎప్పుడూ ఉంది. కనుక దానిని గుర్తించమే సత్సంగం. ఒక సద్గ్రంథాన్ని చదివితే అది సత్సంగం. ఈ సత్సంగం నీ సొత్తు. ఎప్పుడూ ఉంది. కాని దాన్ని యీ గంటసేపూ నీవు గుర్తించావు కనుక 'ఇవాళ గంటసేపు సత్సంగం చేస్తున్నాము' అని చెప్పగలిగావు. ఆ ఎరుకలోనే ఉంటే అదే జీవన్ముక్తి. మనం ఆ గురుపరమాత్మ లోనే ఉన్నాము. మనశ్చాంచల్యం తగ్గి దృఢ నిశ్చయం కలిగి ఉన్ననాడు మనలోనే ఉన్న గురుపరమాత్మని దర్శించ గలుగుతాం! అటువంటి శక్తిని, భక్తిని, అఖండ సాధనా సంపత్తిని గురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక!!

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

2.7.85

"గురుబిన్ ఐసే కోన్ కరే" అనే పాట పాడుతుండగా శ్రీబాబు జోక్యం కలుగజేసుకుని "పండితులు చెప్పండయ్యా అర్థం?' అని అన్నారు. రత్నంగారు దాని అర్థాన్ని వివరిస్తూ 'గురుదేవుడు జ్ఞాన జ్యోతిని ధరించి అజ్ఞానాన్ని హరిస్తాడు' అని చెప్పటం ప్రారంభించేసరికి శ్రీబాబు కలుగజేసుకుని 'గురుదేవుడు జ్ఞానజ్యోతిని ధరించటమేమిటయ్యా? ఆయనే జ్ఞాన జ్యోతి. ఆయన కాంతితో ప్రకృతిలోని సమస్త జీవరాసులు ప్రకాశిస్తున్నాయి. ఆయన దివ్యచరణార విందములను మనస్సునందు నిలిపినపుడు ఆయన నుండి వెలువడిన కాంతి



కిరణము మనస్సులోని చీకటిని తరిమివేస్తుంది. గురుదేవుడన్నా పరమాత్ముడన్నా ఒకటే. అందుచేతనే ఆయనను జ్యోతిర్లింగాయనమః అని పూజిస్తారు. దాని అర్థం అయన జ్యోతి స్వరూపుడు అనే కదా! అందులో ఏమన్నా తప్పు ఉందా? పండితులు మీరే నిర్ణయించాలి" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "గురుదేవులు ఎటువంటి వారంటే తనని నమ్ముకున్న వాణ్ణి ఎన్నడూ మోసం చెయ్యడు. ఆయనకు తనవారు, పరాయివారు అనే వివక్షత ఉండదు. ఒకరియందు అభిమానం, మరియొకరి యందు దురభిమానం అంతకన్నా ఉండదు. కృష్ణపరమాత్ముణ్ణి పాండవ పక్షపాతి అని అజ్ఞానాంధకారములో మునిగి ఉన్న కౌరవులు అనవచ్చు కాని అయనకి పక్షపాత మెక్కడిది? ఆ విషయం జ్ఞాని అయిన భీష్మాచార్యునికి తెలుసు. భీష్మాచార్యుని సమక్షంలో ఎవరైనా కృష్ణపరమాత్ముని దూషిస్తే ఆయన తన చెవులను మూసుకుని 'శ్రవణేంద్రియములు చేసిన కర్మహరించుగాక' అనేవాడు.

తన సహచరులైన కౌరవులకి ఎప్పటికప్పడు వారు చేసే ఆధర్మకృత్యాలను గురించి చెప్తుండేవాడు. యుద్ధసమయంలో గీతాచార్యుని

ముందు విల్లును ధరించి నిల్చున్నప్పుడు కృష్ణపరమాత్ముడు భీష్మునికి విశ్వరూపదర్శనమును ఇచ్చి జ్ఞాన బోధ చేశాడు.

భీష్ముడు అంపశయ్య మీద ఉండగా నవరత్నములతో పొదిగిన పాత్రలో కౌరవులు తీర్థము అందజేయ బోయారు. గాని భీష్ముడు మాత్రం శ్రీకృష్ణ పరమాత్ముని దివ్యచరణారవిందముల నుండి ఉత్పన్నమైన జ్ఞాన తీర్థాన్ని స్వీకరించాడు. ఇంతకంటే ఏంకావాలి? అందువలననే భీష్ముని జన్మ ధన్యమైంది.

పోనీ శ్రీకృష్ణపరమాత్మకి కర్ణుని ఎడల పక్షపాతముందా? కృష్ణపరమాత్ముడు కర్ణుడికి ఏమి అన్యాయం చేశాడు? మీరే ఆలోచించండి. కర్ణుని జన్మరహస్యం గురించి కర్ణునికి తెలియజేశాడు. ఏది ధర్మమో, ఏది ఆధర్మమో తెలియజేశాడు. దృష్టి ఎక్కడ నిలపాలో తెలియజేసి కర్ణునికి ఎంతో మేలు చేశాడు. మీరే ఆలోచించండి. కర్ణుడు తన పూర్వస్థితిని మరచి, తన అధర్మమార్గాన్ని సవరించుకునేసరికల్లా శకుని హెచ్చరికతో మళ్ళీ యథాస్థితికి వస్తాడు. ఇప్పడు మీరే చెప్పండి శ్రీ కృష్ణపరమాత్ముడు కర్ణుణ్ణి ధర్మ మార్గంలో నడవమన్నాడా? లేక ఆధర్మ మార్గాన్ని అనుసరించమన్నాడా?

పరమాత్మునికి శత్రువు మిత్రుడు అనే భేదంగాని, స్వజాతి విజాతి అనే భేదంగాని బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అనే కుల విభేదం గాని లేవు. అలాగే జ్ఞాని కూడా జాతినీతి కులగోత్రాలకు అతీతుడు. ఎందుచేతనంటే ధామత్వంలో అవి ఉండవు. కర్ణుని యొక్క గొప్పతనాన్ని యుద్ధభూమిలో అర్జునునికి కృష్ణ పరమాత్ముడు తెలియజేశాడు. కర్ణుని యొక్క రథము నేల కొరిగి దానిని సరిజేసుకునే సమయంలో అర్జునుడు వేసిన బాణానికి నేలకొరిగి అంత్యశ్వాస విడిచేటప్పడు కూడా తన దానశీలతను ఋజువు చేసుకున్నాడు.

ఈ విషయాన్ని శ్రీకృష్ణపరమాత్ముడు ఋజువు చేయటానికి కృష్ణార్జునులు ఇరువురూ బ్రాహ్మణ వేషధారులై కర్ణుని వద్దకు వచ్చి, పిడికెడు బంగారం దానం ఇమ్మని యాచించారు. దేహమంతా గాయములతో కూడి బాధపడుతున్న కర్ణుడు తనవద్ద ఏ విధమైన బంగారపు ఆభరణము లేదని, తన భార్య వద్దకు వెళ్ళి తన మాటగా చెప్పి తెచ్చుకోమని చెప్పాడు. దానికి

బ్రాహ్మణ వేషధారులైన కృష్ణార్జునులిద్దరూ సమాధానం చెప్తూ నీవు దానకర్ణుడవని నిన్ను యాచించటానికి వచ్చాముగాని నీభార్యవద్దకు వెళ్ళి యాచించవలసిన అవసరంలేదని చెప్పారు. ఇంకా మాట్లాడుతూ 'నీ వద్ద బంగారపు దంతము ఉంది కదా!' అని అన్నారు. కర్ణుడు వెంటనే విషయం తెలుసుకుని, అక్కడే ఉన్న ఒక రాతిలో తన పన్నును ఊడగొట్టుకుని, దానిని ఆ బ్రాహ్మణ వేషధారులకు ఇచ్చాడు. "చూశారా? కర్ణుడు ఎంతటి గొప్పవాడో" అని అన్నారు. "కర్ణుడు అంతిమశ్వాస వదిలే సమయంలో కృష్ణపరమాత్ముని యందే తన దృష్టిని నిలిపి ఉత్తమస్థితిని పొందాడు" అని అన్నారు శ్రీబాబు.

"పోని దుర్యోధనుని విషయం తీసుకుందాం. ఆహంకారంతో గొట్టెపొట్టేలు మీసాలు మెలేసి వీరత్వంతో నా ముందు ఎవరు నిలుస్తారని శ్రీకృష్ణపరమాత్ముని సమక్షంలో తన తొడలు చరిచాడు. అందుచేతనే కృష్ణ పరమాత్ముడు దుర్యోధనునికి వీరస్వర్గం ప్రాప్తింపచేయాలనే భీముని ప్రేరేపించి అతని తొడలపై  వేటు వేయమని సైగ చేశాడు. ఇది ఆధర్మం ఎలా అవుతుంది?

భీముడు దుర్యోధనుని తొడలపై కొడితేనే అతనిలోని అహంకారం బీజం నశిస్తుంది. అప్పడే అతనికి వీరస్వర్గం ప్రాప్తిస్తుంది. ఇది మోసం ఎలా అవుతుంది? పరమాత్ముడు నిష్పక్షపాతి అని ఋజువయింది కదా" అని అన్నారు శ్రీబాబు.

*

### శ్రద్ధాంజలి

శ్రీబాబు భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి పోపూరి గౌరీ వెంకట రత్నమ్మగారు (శ్రీరాధాకృష్ణమూర్తిగారి ధర్మపత్ని), 20-8-13 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 72సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరు కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

ఆమె వెంటనే గర్జించింది "మీరెవరు మునిపుంగవులా? లేక అజ్ఞానులా? మిమ్మల్ని ఆహారంగా స్వీకరించి కొన్ని క్షణాల్లో మీ జీవితాలకు చరమగీతం పాడుతాను" అన్నది.

వెంటనే, రాజుగారు సమాధానం చెప్పాడు. "ఓ రక్కసీ! అనవసరంగా ప్రగల్భాలు పలుకవద్దు. చేతనైతే నీసామర్థ్యాన్ని చూపించు, నీవసలు ఏమి కోరుకొంటున్నావు? అజ్ఞానులు మాత్రమే, తమ కర్మ ఫలితాలకోసం ప్రాకులాడుతారు. జ్ఞానులు ఎప్పుడూ సత్కార్యములను ఫలితము నాశించకుండా ఆచరిస్తారు. మేము నీలాంటి దుష్టులను దోమల్లాగా పారద్రోలగలము. మాకు స్వప్నములో కూడ, యెవరేది కోరినా యివ్వగల



సమర్థత ఉన్నది. జ్ఞాని చాలా ప్రశాంతమైన మనసుతో, హేతుబద్ధంగా, అనుభవ జ్ఞానముతో కర్మ నాచరిస్తాడు".

వారు మాట్లాడిన విధానమును బట్టి, కర్కటి వారు జ్ఞానులని ఊహించింది. వెంటనే తనలో తానిలా భావించింది. "వీరు సామాన్య మానవులుగా స్ఫురించటము లేదు. ఒక పవిత్రమైన జ్ఞానిని, ఆయన వాక్కు, ముఖకవళికలు, నేత్రములద్వారా, నిర్ణయించవచ్చు. జ్ఞాని అంతరాత్మ, ఆయన ముఖకవళికలు, నేత్రములు మాటలాడే విధానమును బట్టి, వ్యక్తమవుతుంది. సముద్రములోని ఉప్పు, నీరు కలిసిపోయినట్లు, మహాత్ముల మనోభవాలు వారిముఖ కవళికలు, నేత్రములు, మాటల ద్వారా వ్యక్తమవుతాయి. కాని అవివేకుల మాటలకు, చేతలకు, పొంతన వుండదు. వీరి జ్ఞానము, నైతిక విలువలు చాలా ఉదాత్తముగా గోచరిస్తున్నవి. అందుచేత వీరిని నేను నశింపజేయలేను. అవినాశమైన ఆత్మ జ్ఞానము మరణ భయమును పారద్రోలుతుంది" అని కర్కటి నిశ్చయానికి వచ్చింది.

కర్కటి వారిని యిలా ప్రశ్నించింది, "పరితాత్ములు, ధీశాలురైన

మీరెవరు? మీరెక్కడి నుండి వచ్చారు?

అప్పుడు మంత్రిగారిలా సమాధాన మిచ్చారు."వీరు కిరాటదేశ రాజు. నేను వారి మంత్రిని. మేమిరువురము దుష్టశిక్షణ,శిష్ట సంరక్షణార్ధము రాత్రి పూట యీ దేశంలో నిశిత దృష్టితో సంచరిస్తున్నాము.

కర్కటి యిలా ప్రత్యుత్తర మిచ్చింది. ప్రభువు మంచివాడైనా, మంత్రి దుష్టుడైతే. అతని సలహాలు, సాహచర్యంతో దుర్మార్గుడుగా మారుతాడు. అలా కాక సత్శీలుడైన మంత్రి లభిస్తే, దుష్టుడైన రాజు కూడ ఉత్తముడు, ఆదర్శ పాలకుడు కాగలడు. దానికి విరుద్ధంగా కూడ, మేధావి సత్శీలుడైన రాజు, మంత్రి ని కూడ సత్శీలునిగా మార్చ గలడు. దుర్మార్గుడైన రాజు మంత్రి ని కూడ దుష్టుగా మార్చగలడు. "యధా రాజా తధా ప్రజా " అన్నారు సత్ప్రవర్తనగల రాజుకి, మేధావి, సద్వర్తనుడైన మంత్రి లభిస్తే, అతను ముల్లోకములలో యేదైనా సాదధించగలడు.

ఎవరికైతే ఆధ్యాత్మిక జ్ఞానము, సమహిత దృష్టి, శాస్త్ర జ్ఞానము వుండి ఉదాత్తులు, ఉదాత్తములై ఉంటారో వారు రాజుకు మంత్రియై పరిపాలన చేస్తారో, ఆ రాజ్యము సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు మిమ్మల్ని తత్త్వజ్ఞానము గురించి ప్రశ్నలు వేస్తాను,ఆ ప్రశ్నలకు మీరు సరియైన సమాధానమిస్తే మిమ్మల్ని నాశిరస్సుపై, పుష్పాలుగా స్థానమిస్తాను. అలాకాదంటే, మీ యిద్దరని ఆహారంగా స్వీకరించి, తృప్తిగా భోంచేస్తాను. నా కుక్షిని దహిస్తున్న గాస్ట్రిక్ మంటకు, మిమ్నల్ని యింధనముగా స్వీకరిస్తాను.

అప్పుడు రాజు గారు "ఓ కర్కటీ! నువ్వడగ దలచిన ప్రశ్నల నడుగు. వాటికి నేను సరియైన సమాధానాలు చెప్తాను. వశిష్ఠమహర్షి శ్రీరామ చంద్రునితో యిలా అన్నాడు "ఓ కమలాక్షుడైన రామచంద్రా! రాక్షసి వేసిన ప్రశ్నలను శ్రద్ధగా వినుము. కర్కటి యిలా ప్రశ్నించింది.
1. సముద్రపు ఉపరితలముపై ఉత్పన్నమయ్యే నీటి బుడగల్లా, అనేకానేక జగత్తుల మూలము, స్థితి, లయములకు మూలకారణమైన, అణు వేమిటి?

2. ఏది ఆకాశములాగా చరిస్తుంది? కాని ఆకాశము కాదు.

3. ఏది అవధులు లేని దయ కూడ,అవధులు ఉన్నట్లు గోచరిస్తున్నది?

4. ఏది కదులుతున్నట్లు కన్పించినా, కదలిక లేనిది?

5. ఉనికి వున్నట్లు గోచరిస్తున్నా, ఉనికి లేనిది యేమిటి?

6. ఏది చిత్(తెలివిగా కదలాడుతున్నట్లు గోచరించినా శిలలా స్థాణువైనదేమిటి?

7. ఆకాశముపై చిత్రాలు గీచే దేమిటి?

8. బీజములో వృక్షము యిమిడివున్నట్లు, యెన్నో బృహత్పదార్థములను తమలో యిముడ్చు కొన్న అణు వేమిటి ?

9. సముద్రపు నీటిపై నురగలాగ, అన్ని వస్తువులు యెక్కడ నుండి ఉత్పన్నము అవుతున్నాయి?

10. అవి తిరిగి ఎందులో లీనమవుతాయి?

– సశేషం

*శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు*

*అందరూ ఆహ్వానితులే!*

శ్రీ సర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి రజతోత్సవ(25వ) పుణ్యారాధన మహోత్సవములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని మ చంద్ర కాళీ ప్రసాద మాతాజీవారి అధ్వర్యంలో శ్రీకాళీ గార్డెన్స్, నంబూరులో ది.20.11.2013 బుధవారం నుండి ఆదివారం వరకు 1.12.2013 పంచయజ్ఞవిధులతో జరుపబడును. కార్యక్రమ వివరములు 15వ పేజీలో చూడగలరు ఈ కార్యక్రమాలలో ప్రతిభక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష.

వివరములకు : ట్రస్ట్ ఆఫీస్ : 0863 2293564; మురళీ మోహన వర్మ:9398334345; కుమారస్వామిరాజా :9346535357.

# శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు

అక్టోబర్ 2013

3 గురు మాసశివరాత్రి

5 శని నుండి 16 బుధ వరకు శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

5 శని శ్రీ మాతాజీవారిచే దీక్షా స్వీకారం, అఖండ జ్యోతి ప్రజ్వలనం

6 ఆది నుండి 14 మంగళ వరకు ఆధ్యాత్మిక ప్రసంగాలు, మాతాజీవారి దివ్యబోధ, శ్రీగురుదేవుల దివ్యదర్శనము, బోధ (వీడియో), మ్యూజియమ్

11 శుక్ర మూలానక్షత్రం , శ్రీ సరస్వతి పూజ, శ్రీ జగన్మాత సామూహిక పూజలు

12 శని దుర్గాష్టమి

13 ఆది మహర్నవమి శ్రీ జగన్మాత సామూహిక పూజలు

14 సోమ విజయదశమి నామకరణములు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు.

15 మంగళ ఏకాదశి ఏకాహం

16 బుధ దీక్షా విరమణ, మంత్రాక్షలతో మాతాజీ ఆశీస్సులు, జగన్మాత ఊరేగింపు, రాత్రి 8 గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

18 శుక్ర పూర్ణిమ శ్రీమాతాజీవారి జన్మదినోత్సవము, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

29 మంగళ శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

నవంబర్ 13

2 శని నరకచతుర్దశి, మాస శివరాత్రి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

3 ఆది దీపావళి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాసులు కాల్చుట

6 బుధ నుండి 14 గురు వరకు ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వర స్వామికి పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన.

7 శని నాగుల చవితి

14 గురు క్షీరాబ్ది ద్వాదశి, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 ఆది గురుపూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశం, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి నగరోత్సవం.

**నవంబర్ 20 బుధవారం నుండి 1 వ తేది డిశంబర్ వరకు శ్రీ గురుదేవుల పంచవింశతి(25వ) రజతోత్సవ పుణ్యారాధన మహోత్సవాలు పంచ యజ్ఞ విధులతో జరుపబడును.**

**ది. 20.11.13 ఉదయం శ్రీమాతాజీవారిచే ఏకాదశాహ్నిక దీక్షా స్వీకారము; రాత్రి శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.**

**<u>నిత్య కార్యక్రమాలు</u>**

**1.ఉదయం 3గం.30నిలకు మేలుకొలుపు (సుప్రభాతం); 4గం.30నిల నుండి 5గం.30 నిల వరకు ప్రార్థన, మహామంగళ హారతి; 5గం.30నిల నుండి 6గం.30నిల వరకు సంకీర్తనతో పాటు పాదుకా ప్రదక్షిణ; 6గం.30నిలకు బ్రహ్మ శ్రీ కొండూరి రామ బ్రహ్మంగారిచే వేదపఠనము; ఆలయ దర్శనము, తీర్థ ప్రసాదములు; 8 గం.లకుశ్రీ గురుగీతా ప్రవచనము – ప్రవాచకులు శ్రీరామ తారక పరబ్రహ్మ ప్రసాద్‌గారు, శ్రీ వెంకటరమణ ప్రసాద్‌గారు.**

**2.ఉదయం 7 గం.లకు – శత సహస్ర నామార్చన శ్రీ సద్గురు పాదపూజ; భక్త సమారాధన.**

**3. శ్రీ గురు పరమాత్మ యాగము.**

**4.అఖండ హరినామ సంకీర్తన.**

**5. రాత్రి 7 గం.లకు మహా మంత్ర పుష్పము, దర్బారు.**

**6. ది.21.11.13 నుండి 23.11.13 వరకు బృందావనానికి, ఆలయాలకు కుంభాభిషేకములు.**

**7. ది.24.11.13 నుండి 27.11.13 వరకు సాధు ధర్మ సమ్మేళనము. 27న యతీశ్వరపూజ, సాధుమహాత్ములకు సన్మానము.**

**8. 27.11.13 శ్రీగురుదశమి – శ్రీ గురుదేవుల పుణ్యారాధన;28.11.13 తె.జా 3గం.లకు శ్రీగురుదేవులకు బృందావనంలో నమక, చమక సహిత మహాభిషేకం.**

**9.28.11.13 నుండి 30.11.13 వరకు సత్సంగ సమావేశాలు – శ్రీ మాతాజీ వారిఅనుగ్రహ భాషణము, భక్తులచే ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి.శ్రీ సద్గురుదేవుల దర్శనం(వీడియో); శ్రీబాబూజీ వాడిన వస్తువుల ప్రదర్శన (మ్యూజియం)**

<u>విశేష కార్యక్రమాలు</u>

సామూహిక సద్గురు పూజలు; దీపోత్సవం,డోలోత్సవం(ఊంజల సేవ); తెప్పోత్సవం – ఇవి జరుగు తేదీలు తర్వాత నిర్ణయింపబడును.

ది.1.12.13 మహామంగళహారతి; దీక్షా విరమణ; స్వామివారి నగరోత్సవం

# గురుకృపా హి కేవలమ్

– రమణ ప్రసాద్

"1988 నవంబరు 15 నాటికి తప్పక తయారు చేస్తాను" అన్నాడు ఆ నేతగాడు. అన్నట్లుగానే నవంబరు 15వ తేదీన ఐదు పంచలూ నేసి తీసుకొచ్చాడు. పంచలు చాలా బాగున్నాయి. నాకు సంతోషం కలిగింది. "అమ్మయ్య! ఎలాగైతేనేం శ్రీబాబు కోరిన పంచలు సమర్పించుకో గలుగుతున్నాను" అని తృప్తి కలిగింది.

తెల్లవారేసరికి డిశంబరు 1న నా భార్య, మా అమ్మగారు, మా పెద్ద అమ్మాయిని బాపట్లనుండి తీసుకువచ్చారు. మా అమ్మగారు " అబ్బాయి! ఈ పిల్లకు ఏదో ధూళి సోకిందిరా! దాన్ని బాబు దగ్గరకు తీసుకొనివెళ్ళి దర్శనం చేయించరా! తగ్గిపోతుంది" అన్నది.

డిశంబరు 2న మా అమ్మాయి పిచ్చి చూపులు చూస్తూ " అదిగో ! బాబు వస్తున్నారు. వెళ్ళకండి బాబూ!" అని పెద్దగా కేకలు పెడుతూ, పిచ్చి చూపులు చూస్తూ వింతగా ప్రవర్తించింది. డిశంబరు 3న ఉదయమే వెంకటగిరి నుండి బయల్దేరి శ్రీబాబు కొరకు నేయించిన పంచలు తీసుకొని ఆశ్రమానికి వచ్చాను. శ్రీబాబు భౌతిక శరీరాన్ని వదిలి మహా సమాధి ప్రవేశించారు అనే వార్త అశనిపాతంలా తగిలింది. విల విలలాడిపోయాము. నా జన్మలో అంత దుఃఖాన్ని ఎప్పుడూ అనుభవించలేదు. కాలమే మా దుఃఖాన్ని ఉపశమింప చేసింది.

వెంకటగిరి చక్కటి ఆధ్యాత్మిక స్పృహ ఉన్న పట్టణం. తరచు అక్కడ చాలా సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేను ఈ సత్సంగాలలో పాల్గొన్నాను. ఆ తరువాత ఇక్కడ మనం ఒక సత్సంగం ఏర్పరిచి శ్రీ సద్గురుదేవుల దివ్యబోధను ఎందుకుప్రచారం చేయకూడదూ అనే అభిప్రాయం కలిగింది. పైగా "నేను నీ వెంట వస్తున్నాను" అన్న బాబు మాట మనసులో మెదిలింది.

శ్రీమాతాజీవారిని వెంకటగిరికి ఆహ్వానించాను. ఆర్ & బి గెస్ట్ హౌస్‌లో బస ఏర్పాటు చేశాను. శ్రీ మాతాజీ అక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకొని, తరువాత మా ఇంటికి వచ్చారు. ఆమె వస్తున్నట్లు మాకు తెలియచెయ్యలేదు. నా భార్య వంటగదిలో ఏదో పనిలో ఉంది. శ్రీ మాతాజీ

వంటగదికి వచ్చి కుడి  చెయ్యి పైకి ఎత్తి ద్వార బంధానికి  ఆన్చి, ఎడం చేతితో  రెండవ పట్టీని పట్టుకొని, "రమ్మన్నావు కదా! వచ్చాను. నా కోసం ఏం చేశావు?" అని అడిగారు.

మధ్య గదిలో స్టేజికి కావాల్సిన సామాన్ల జాబితా చూస్తున్న  నేను నమ్మలేక  పోయాను. 'అది శ్రీ బాబు గొంతు. బాబు ఎలా వచ్చారు?' హడావిడిగా వంటగదికి వచ్చాను. శ్రీ మాతాజీ నిల్చుని ఉన్న భంగిమా, వారి మాటలూ – నూటికి నూరు పాళ్లూ శ్రీబాబువే. అంటే శ్రీ బాబు తమ వాగ్దానం నిలబెట్టుకొన్నారు. వారిది ఇక్ష్వాక వంశం కదా! మాట తప్పరు. నేనూ, నా భార్యా పిల్లలూ వారికి పాదాభి వందనం చేశాము.

ఆ రోజు సత్సంగ సమావేశం కన్యకాపరమేశ్వరి దేవాలయంలో జరిగింది. శ్రీ మాతాజీవారి వాక్య విన్యాసమూ, మాటల పొందికా, పద ప్రయోగమూ, తత్త్వ వివరణమూ, అంతా ముమ్మూర్తులా శ్రీబాబూజీవే. ప్రజలంతా ముగ్ధులైనారు.

గురుపూజ సందర్భంలో శ్రీ మాతాజీవారికి ఒక వెంకటగిరి చీర సమర్పించ బోయాను. వారు దానిని స్వీకరించటానికి అంగీకరించలేదు. "మనస్సులో భక్తి ఉంటే చాలు. మీ హృదయ వస్త్రాన్ని కప్పండి. చీరలతో నాకు అవసరం లేదు" అన్నారు. వారు వస్త్రాన్ని  తిరస్కరించటం నాకు బాధ కలిగింది. ఇంతలో ఒక ఆలోచన వచ్చింది. శ్రీ బాబూజీయే శ్రీ మాతాజీ రూపంలో వచ్చారు అని నా అనుభవమూ, విశ్వాసం కూడా. శ్రీబాబు తనను వస్త్రం తెమ్మనీ, తాము స్వీకరిస్తామనీ అన్నారు కదా! మరి అమ్మ ఎందుకు అంగీకరించటం లేదు? ఎలాగైనా తీసుకోవలసిందే అన్నాను.

" అలా అయితే ఇవ్వండి. తీసుకుంటాను" అని నవ్వుతూ స్వీకరించారు అమ్మ. నన్ను వస్త్రం తెమ్మన్న విషయం నాకు శ్రీ బాబూజీకి మాత్రమే తెలుసు. అది ఇప్పుడు అమ్మకు తెలిసి అంగీకరించింది. అంటే శ్రీబాబే అమ్మ రూపంలో వచ్చారని దృఢమైనట్లే కదా!

ఇలా శ్రీబాబూజీ, శ్రీమాతాజీలు ఇద్దరూ వేరు వేరు మూర్తులుగా కనిపించినా, నిజానికి ఒకటే అని దృఢపడి నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది." అని తాము పొందిన అనుభవాన్ని వివరించారు శ్రీ వెంకట రమణ ప్రసాద్‌గారు.

-సశేషం

# గణపతి

R.TC.లక్ష్మి

మానవుని మనస్సు కోరికల పుట్ట. ఎన్ని కోరికలో, అన్ని భావాలు. లెక్కలు అందని అంతుచిక్కని వ్యవహారం. అయితే కోరికల రూపేణా కానివ్వండి, కర్మానుసారం కానివ్వండి కొన్ని కొన్ని సంఘటనలు జరుగుతాయి. కొన్ని కావాలని కొసరి కొసరి అడిగినవి, మరికొన్ని ఊహించలేనివి ఉంటాయి. వాటిలో యిష్టాయిష్టాలను అవసరాన్ని బట్టి అవగాహనను బట్టి శుభాశుభాలుగా పరిగణిస్తుంటాం.



నామరూప క్రియా రహితుడైన ఆ పరమాత్మ, ఆ యా కోరికలను బట్టి ఆ యా రూపాలతో, ఆ యా ఆయుధాలతో, శక్తి యుక్తులతో, దర్శనమిచ్చి, వరాలనిచ్చి లేదా మొక్కులను మొరలను ఆలించి, ఆ యా ఫలితాలను కలుగజేస్తూ ఉంటాడు. అన్ని దేవతా రూపాలలోనూ శ్రీగురుదేవులే ఆ ఫలితాలను ప్రసాదిస్తూ ఉంటారు.

శ్రీ గణపతి స్వరూపం కూడా అలాంటి విశిష్ఠ రూపాలలో ఒకటి. శ్రీ మహాగణపతి సృష్టి పూర్వం కూడా ఉండేదిట. ఆది దంపతులు శ్రీపార్వతీపరమేశ్వరులు కూడా వారి కళ్యాణవేళ వినాయకుడిని పూజించారు. వేదాలలో, ఉపనిషత్తులలో కూడా మహాగణపతి స్తుతి ఉంటుంది. 'గణానాం త్వా గణపతిగ్ం.....' అనకుండా దేనినీ ప్రారంభించరు. యోగపరంగా కూడా మూలాధారంలో ఉన్న గణపతి అనుజ్ఞ లేనిదే కుండలినీ శక్తి కదలదట. అందువలన కూడా ఆయన ఆదిదేవుడు. గణపతి ఆరాధనలో శ్వేతార్క గణపతియే కాక, ఉచ్ఛిష్ఠ గణపతి అని కూడా ఒక ఆరాధనా విధానం ఉన్నదట.

ఆయన ఆదిదేవుడు. విద్యల పెన్నిధి. గజముఖంతో, వ్యాళ యజ్ఞోప వీతంతో లంబోదరుడై అనింద్యుడు అనే ఎలుక వాహనంపై దర్శనం యిస్తాడు. వేదవిద్యలతోపాటు అత్యంత సమీప కాలమైన ద్వాపరయుగంలో వేదవ్యాసుడు ఉపదేశిస్తుండగా, వేదసారము పంచమవేదము అనదగిన లక్ష శ్లోకాల 'జయ' అనే పేరు ఉన్న మహాభారతం వ్రాయసాగాడు. వ్రాసిన వాడు మహాగణపతియే, ఈశ్వరాంశ సంభూతుడు. సిద్ధి, బుద్ధి అనే తన దివ్య శక్తులతో కోరిన కోరికలనొసగే దేవతలందరిలోనూ, దేవతలలోనూ అగ్ర

తాంబూలమందు మేటి.

శ్రీమహాగణపతి వైభవాన్నీ – అంతలోనే ఆయన నిరాడంబరత్వాన్నీ, భక్తజన వాల్లభ్యాన్నీ ఎందరో వర్ణించారు. వర్ణిస్తూ కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు ఏమన్నారో చూడండి –

ఎలుక గుఱ్ఱము మీద నీరేడు భువనాలు పరుగెత్తి వచ్చిన పందెకాడు.
ముల్లోకములనే ముక్కంటి యింటిలో పెత్తనమ్మొనరించు పెద్ద కొడుకు
'నల్లమామా' యంచు నారాయణుని పర్యాచకాలు ఆడు మేనల్లు కుఱ్ఱ.
వడకు గుబ్బలి రాచవారి బిడ్డ భవాని నూఱేండ్లు నోచిన నోము పంట.
అమరులం దగ్ర తాంబులమందుమేటి
ఆరుమోముల జగజట్టి అన్నగారు
విఘ్నదేవుడ వ్యాహాళి వెడలి వచ్చె
ఆంధ్ర విద్యార్థి! లెమ్ము జోహారు లిడగ

అంటూ ఆ వచ్చిన జగజట్టి ఎంత నిరాడంబరుడో! ఎంత భక్త సులభుడో!

లడ్డూ జిలేబి హల్వాలె యక్కర్లేదు,
బియ్యపు ఉండ్రాళ్ళకే చెయ్యి చాచు.
వలిపంపు పట్టు దువ్వలువలే పనిలేదు
పసుపు గోచీకే సంబ్రాలు పడును.
ముడుపు మూటల పెట్టుబడి పట్టుదల లేదు.
పొట్టి గుంజీళ్ళకే పొంగి పోవు.
కల్కి తురాయిలకై తగాదా లేదు,
గరిక పూజకే తలకాయి నొగ్గు.

పంచకళ్యాణికై యల్కపాన్పు లేదు
ఎలుక తత్తరికే భుజాలెగురవైచు.
పంచభక్ష్యాలకే మొండిపట్టు లేదు.
పచ్చివడపప్పే తిను వట్టి పిచ్చి తండ్రి!

బాహ్యాడంబరాలేవీ అవసరం లేదు. అతి సామాన్యమైన ఆరాధనతో అత్యంత కరుణను పొందవచ్చు. శ్రీగురుదేవుల అపార దివ్య శుభాశీస్సులను గణపతి మహారాజు ద్వారా మరోసారి అందుకుందాం! సాధనలో పురోగమిద్దాం!!

*

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

"సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డృక్కిం కరణే' అన్నది ఎంత విలువైనదో గుర్తించారా?" అని శ్రీసద్గురుదేవులు ప్రశ్నించారు. "నీ శరీరాన్ని దేనికోసం వాడుకోవాలి? లోకంలో విషయాదులు అనుభవించటం కోసమా? శరీరం ఒక పరికరం. శరీరం నీకు ఆవాస క్షేత్రం సుమా! దీనిని వాడుకుని దేనిని సాధించాలి? అనే ప్రశ్న వేసుకో. అది మోక్షసాధనం. అది శాశ్వతం కాదు. దాన్ని ఎలా వాడుకున్నా వదిలిపెట్టవలసినదే. లోకంలో వదిలిపెట్టె వాటిమీద మమకారం పెంచుకుంటున్నాము. పోనీ అనుభవించిన ఏ క్రియలోనైనా తృప్తి అనేది ఉంటుందా?



లోకం ఒక ప్రదర్శన శాల. లోకంలో దేనినైనా త్యజించ వలసినదే. ఏదీ నీదికాదు అన్న విషయం గుర్తించాలి. ఈ జీవితాన్ని అమర్చినవాడు ఎవడు? అనే విచారణ చేయాలి. ఇటువంటి పరివర్తన ఎప్పుడు రావాలి? సరియైన సమయంలో రావాలి. ఎన్ని పుణ్య కార్యాలు చేసినా, ఎన్ని పుణ్య కర్మలు ఆచరించినా, ఎన్ని ఉపాసనలు చేసినా నీ యదార్థ స్థితిని గుర్తించటం అసంభవం. అవి నీ యదార్థ స్థితిని గుర్తించటానికి, అనువైన అవకాశాన్ని కలుగజేయవచ్చు. ప్రాపంచిక అనుభవాలు ఎన్నైనా, నీ స్వరూపాన్ని తెలియ జేయవు. నువ్వు దేనినీ వదల వలసిన పని లేదు. నిన్ను అవే వదిలేస్తాయి.

నీ దేహ, యింద్రియ దృష్టి వదిలి బయటపడ గలిగితే, కలిగేదే అనుభూతి. ఈ శరీరం ఉండగానే పొందగలవు. అదే మహాత్ముల హెచ్చరిక. నీ దేహం త్యాగం చేయవలసిన సమయం ఆసన్నమయినప్పుడు యింక దేని కోసం తాపత్రయం? కీర్తి ప్రతిష్ఠల కోసమా? ఇంకా దేనిని సాధించాలి? ఇప్పుడైనా నీ యదార్థ స్థితిని గుర్తించు. నీ ముఖం చూసుకోవటానికి అద్దం చూస్తావుకదా. ఇప్పుడైనా నీ మనసును అంతర్ముఖం చేసి, నీ స్థితిని గుర్తించు అని మహాత్ములు హెచ్చరిస్తున్నారు అన్నదే గురుదేవుల ఆవేదన. 'నేను' అనే ఆత్మతత్వం దేహేంద్రియాలకు విలక్షణంగా ఉంది అని తెలుసుకోవటమే సాధన.

*

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

మా కాపురానికి ఇల్లు కుడా కుదిర్చావు గనక నేను వెళ్ళి ఇంట్లో తట్టా బుట్టా  పెట్టె అన్నీ సర్దుకుని పిల్లలతో తిరిగొస్తాను మామయ్యా అన్నాడు పున్నయ్య. సరే నన్నాడు చెంచయ్య. భార్యని తీసుకొని పల్లెకి తిరిగి వచ్చాడు పున్నయ్య. ఊళ్లో అడుగు పెడుతుంటేనే ఎందుకో తెలియని ఆనందం కలిగి హాయిగా గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు. పిల్లల్ని చూస్తే వాళ్ళేమీ తమ కోసం దిగులు పడ్డట్టు లేరు. మొహాలు వికసించే ఉన్నాయి. మూడో నాడు ప్రయాణం అన్నాడు. మర్నాడంతా అన్నీ సర్దుకోవాలి అన్నాడు. పిల్లలు మొహ మొహాలు చూసుకున్నారు. వాళ్ళ కళ్ళలో అయిష్టం కనబడింది.



"మన ఆవుల్ని ఎవరికైనా అప్పగించాలి కదయ్యా! నాకో ఆలోచన వస్తోంది చెప్పనా" అన్నాడు నారయ్య తండ్రితో. "ఈచుట్టు ప్రక్కల ఎక్కడా మేత లేకపోవటంతో వాటిని అల్లంత దూరాన ఉన్న బృందావనానికి రోజూ తోలుకెడుతున్నాను. అక్కడంతా పచ్చని పసిరిక, పక్కనే నదినిండా నీళ్ల ఉన్నాయి.మన గోవులు తృప్తిగా గడ్డితిని నీళ్లు తాగుతున్నాయి. ఇంకా అక్కడ చాలామంది పిల్లలు గోవుల్ని మేపుకొంటూ ఉన్నారయ్యా. మధ్యాహ్నం ఎండవేళ నీడ వచ్చే చెట్లెన్నో ఉండి నాకు వాటికికూడా ఎంతో సుఖంగా ఉంటోంది. అందుకని మన గోవుల్ని ఆ పిల్లలకి వప్పగించినట్లయితే వాళ్ళ మందల్లో కలసి తిరుగుతుంటాయి ఏమంటావు?" అన్నాడు. నారయ్య చెప్పిన విషయం పున్నయ్యకి నచ్చింది. "అయితే మనం అక్కడికి వెళ్ళి వాళ్ళతో మాట్లాడి వద్దాం పద" అన్నాడు కొడుకుతో.

ఇద్దరూ బృందావనం దారి పట్టారు. గోవులు ముందు నడుస్తున్నాయి. నడిచే దారిలో నారయ్యతో మధుర సంగతులు చెపుతున్న పున్నయ్యకి ఎంతో కమ్మగా చెవులకింపుగా గాలిలో

తేలివస్తున్న పిల్లన గ్రోవి పాట వినబడ సాగింది, గోవుల నడకవేగం పెరిగింది. చెప్పేది ఆపి పున్నయ్య అది వినటానికి ప్రయత్నం చేయసాగాడు. మత్తెక్కించే పూల వాసనలు ముక్కుని తగిలి వాళ్ళకి చేరవలసిన చోటుని చూపిస్తున్నాయి. వాళ్ళిద్దరూ ముందుకు వెళ్ళి ఒక చోట ఆగారు. గోవులు మేత కోసం పోయి తక్కిన మందలోకలిసి పోయాయి. చెట్ల క్రింద గుంపులు గుంపులుగా ఉన్న పిల్లల్లో ఒక రిద్దరు వాడికి దగ్గరగా వచ్చి నారయ్య వంకచూసి నవ్వుతూ 'ఏం కావాలి?' అన్నారు. పున్నయ్య తన మాట ఎవరితో చెప్పాలి అని ఆలోచిస్తున్నాడు. నారయ్య ఆ పిల్లల చెవిలో ఏదో ఊదాడు. ఒకడు పున్నయ్య కేసి తిరిగి " అయ్యా! అదిగో ఆ పొగడ చెట్టు కింద కూచున్న మా కిట్టయ్యతో చెప్పండి" అన్నాడు. పున్నయ్య నారయ్య వెనక నడిచాడు. బాగా దగ్గరగా వెళ్ళి నిలబడినా ఆ పిల్లవాడు కళ్ళెత్తి కూడా వాళ్ళని చూడ లేదు. ఊదుతున్న పిల్లన గ్రోవిని చేతిలో పట్టుకొని కళ్ళువాల్చి దానినే చూస్తున్నాడు. ఎలా మాట్లాడలో ఏం చెప్పాలో పున్నయ్యకి తోచలేదు. అసలు వాని మోహనాకారం చూస్తూ మనస్సు తన్మయమై ఉంది వానికి.

"పుట్టి పెరిగిన గడ్డకాక పొరుగూరు బువ్వ పెడుతుందా" ఎర్రని పెదవులుమధ్య నుంచి ఆపలుకులు వెలువడ్డాయి. ఉలిక్కి పడ్డాడు పున్నయ్య తనతోనేనా ఆ మాటలన్నది! మళ్ళీ మధురంగా ఆ కుర్రవాడే అన్నాడు, "వరుణుడు కరుణించాడు పుడమి తల్లికి పులకలు కలిగాయి పట్టుబడితే బంగారం పండుతుంది". ఆక్షణాన కొడుకు చెప్పిన మాటలు పున్నయ్యకి గుర్తువచ్చాయి, "అయ్యా! మీరొచ్చే రెండు రోజులు ముందు చాలా గట్టి వానలు కురసి నేలంతా వెన్నలాగయింది. అరక బట్టి దుక్కి దున్నితే విత్తనాలు జల్లుకోవచ్చు కదయ్యా" అని. పున్నయ్యకి అంతా వింతగా ఉంది. ఎలాగో నోరువిప్పి "మేము మధురా నగరానికి వెళ్ళిపోతున్నాము. మా గోవుల్ని మీ మందలో చేర్చుకొని కాస్త వాటినికూడా చూస్తుండండి బాబు!" అని మళ్ళీ తనే అందుకొని "ఎండిపోయి పాలివ్వని గోవులు, ఎన్నిసార్లో చూలు నిలవకుండా పోతున్న ఒక గోవుకూడా ఉంది మందలో" అన్నాడు.

విశాలమైన నల్లని కనుకొనల నుంచి పున్నయ్యని చూస్తూ "అలాగా! పొదుగు కింద కుండ పెడితే పొంగి పొర్లేట్లు పాల ధారలు కురిపించే గోవులే గాని ఎండి పోయిన గోవుల్ని నేనెక్కడ చూడలేదు. అలాగే చూలింతలైన గోవులే గాని గొడ్డుమోతు గోవుల్ని కూడా నేనెరగను మరి!" అన్నాడు."నేను అబద్ధమాడలేదు బాబు" అని పున్నయ్య అంటే నేనూ నిజమే చెప్తానయ్యా" అన్నాడు ఆ చిన్నారి బాలుడు.అంటూ ఒక క్షణం ఆగి నాలుగు రోజులాగి వస్తే అన్నీమాట్లాడదాము" అన్నాడు, "తనమాట ఔనన్నట్టా? కాదన్నట్టా?" వెనక్కి తిరుగుతూ పున్నయ్య అనుకున్నాడు.

"ఇంతకీ ఆ పిల్లడెవరు?" అనడిగాడు కొడుకుని, "ఆ పిల్లలంతా చెప్పారయ్యా! వ్రేపల్లెకు రాజైన నంద బాబయ్యగారబ్బాయి" అని మాఅందరికి కిట్టయ్య మాటే వేదం" అనికూడా అన్నారయ్యా అన్నాడు నారయ్య. అందుకే కాబోలు ఆ ముఖంలో వర్చస్సు! రాజలీవి!" అన్నాడు పున్నయ్య.

-సశేషం

## ఆధారం - ఆధేయం

మానవ దృష్టి ఆధేయాన్ని చూస్తుందేకాని, ఆధారాన్ని చూడదు. చేతిలో రూపాయి పట్టుకుని, మీకు చూపుతూ 'ఇదేమిటి?' అన్నాను. మీరు 'రూపాయి' అంటారు. మీకు నేను చూపిన వస్తువులు రెండు. ఒకటి నా చేయి. రెండోది రూపాయి. చేయి ఆధారం. రూపాయి ఆధేయం. మీ దృష్టి ఆధేయమయిన రూపాయిని గుర్తించి, ఆధారమైన చేతిని విస్మరించింది.

రూపాయి చేతిలో ఒక భాగంలో, ఒకానొకప్పుడు మాత్రమే ఉంది. ఆధారానికి, ఆధేయానికి వ్యత్యాసమిది. పరమాత్మ ఆధారం, ప్రపంచం ఆధేయం. 'ఏకాంశేన స్థితో జగత్' ఆధారమైన పరమాత్మ యొక్క ఒక అంశంలో ఆధేయమైన జగత్తు ఉన్నది. అది ఎప్పుడూ ఉండేది కాదు. ఒకప్పుడే. అయినా మనం ఆధారాన్ని వదిలి ఆధేయాన్నే చూస్తాము.

(గత సంచిక తరువాయి) **సర్వము నీ దయ** - సుశీలా ప్రసాద

శ్రీవర్ధనుడు మండి పడుతూ తలుపుల పైన బాదసాగాడు. ఆ ధ్వనిని భరించలేక సేవకుడు మళ్ళా తలుపులు తెరిచాడు. ఈ రణగొణ ధ్వని నుంచి మరిద్దరు ముగ్గురు సేవకులు అక్కడ చేరి వింత చూస్తూ కఠిన పరిహాసాలు సాగించారు. వారిలో ముఖ్యుడైన సేవకుడు "నేను నిన్ను మా యజమాని దగ్గరకి తీసికెళ్ళి నట్లయితే ఇక మళ్ళీ తన వద్దకు రావద్దని గట్టిగా దండిస్తారు సుమా" అని హెచ్చరించాడు.

"ఓరి మూర్ఖుడా! నువ్వు, యీ భటులు ఏదో పొరబాటున మీ చక్రవర్తిని గుర్తించలేక పోయినా మీ యజమాని మాత్రం తమరిలా కాక చక్రవర్తి చేసిన మేలును తలచి ఏ హీన పరిస్థితులలో ఉన్నా సరే తన మహారాజును గుర్తించ గలడు " అంటూ గర్జించాడు. ఈ మాటలు వింటూ సేవకులు వానిని మరింత వేళాకోళాలు చేస్తుంటే వారి చేష్టలని ఓర్చలేక చక్రవర్తి ఆవరణలో పరుగులు పెట్టాడు. ఈ అల్లరి ఆపడానికి సేవకుడు ఒకడు చారుగుప్తునికీ సమాచారం అందిచడానికి లోనికి వెళ్ళాడు.

భవనంలో విశ్రాంతిగా ఉన్న చారుగుప్తుడు ఒక సేవకుడు తన వద్దకు వచ్చి నిలవటం గమనించి "ఏని పని?" అని ప్రశ్నించాడు. "మనభవన సింహ ద్వారంలో దిగంబరుడైన ఒక పురుషుడు వచ్చి నిలబడ్డాడు. ఆ వ్యక్తికి తమ దర్శనం కావాలట. పైన ఆతగాడు తను శ్రీవర్ధన చక్రవర్తినని ప్రస్తుతం ఆహారమూ, దుస్తులూ, విశ్రాంతీ కోరి యీభవనంలో తన సేవకుని వద్దకు వచ్చాననీ పిచ్చివానిలా పలుకుతున్నాడు. సేవకులంతా వానిని అల్లరి చేస్తూ బాధిస్తున్నారు. తమరు ఆజ్ఞయిస్తే వానిని లోనికి తీసుకు వస్తాను" అన్నాడు వినయంగా ఆ భటుడు. చారుగుప్తునికి వానిమాటలు ఆశ్చర్యం కలిగించాయి. చక్రవర్తి కొలువులో సేవకునిగా ఉన్న తనసేవా తత్పరతను, ప్రభు భక్తిని గమనించిన శ్రీవర్ధన చక్రవర్తి రాజాటవులమీద, ఉద్యానవనాల మీద తనను అధిపతిగా నియమించారు. ఈ భవనం నిర్మించి యిచ్చి, వేటకు వచ్చినప్పుడల్లా తనను చూసిపోతుంటారు, అని ఆలోచిస్తుండగా బైట జరిగే అల్లరి లీలగా వాని చెవులకి సోకింది. ఆ వ్యక్తిని తీసుకుని రమ్మని సేవకుని ఆజ్ఞా పించాడతడు.

సేవకుడు బైటకి వచ్చి శ్రీవర్ధనుని తనను లోనికి రమ్మని పిలవగానే

రాజుకి ప్రాణం లేచి వచ్చి నట్లనిపించింది. ఇక తను కష్టాలనుండి గట్టెక్కినట్లే. చారుగుప్తుడు తనను చూసి గుర్తించగానే ఈ సేవక అధములంతా, ఈ భవనమంతా తన అడుగులకు మడుగులొత్తక మానరు, గజగజ వణికిపోక తప్పదు. ఇలాగ ఆలోచించిన రాజు మనస్సులో గర్వరేఖలు నిండాయి. సేవకునితో లోనికి అడుగుపెట్టిన రాజు చారుగుప్తుని వంక ఠీవిగా చూస్తూ "చారుగుప్తా! నీ చక్రవర్తి రాజ దుస్తులుగాని రాజచిహ్నాలు గాని ధరించ కుండా నీముందు ఈ విధంగా నిలబడటం అత్యాశ్చర్యంగాను వింతగొలుపుతూ ఉండవచ్చును. కొంత సేపు తరువాత నేను తేరుకున్నాక సంగతంతా నీకు వివరంగా తెలుపుతాను. ముందుగా నాకు తగిన దుస్తులూ,,," అంటూ మాట మధ్యలోనే ఆగి పోయాడు. ఎందుకంటే చారుగుప్తుని చూపులలోచక్రవర్తిని గుర్తించిన చిన్నెలుగానీ, ప్రభువుపట్ల చూసే వినయ విధేయతలుగానీ తనకి అగపడ లేదు. ఎన్నడూ వానిని ఎరగనట్లు చూస్తున్నాడు. అది చూసి చక్రవర్తి నిశ్చేష్టుడై పోయాడు. ద్వారపాలకుడు అన్నట్లుగా ఇదంతా తాను తన రాజమందిరంలో నవరత్న మణిఖచితమైన తల్పం పైన పరుండి గాఢ నిద్రలో అనుభవిస్తున్న స్వప్న మేమో? కలే అయితే ? యీ దుర్ఘటనలన్నీ త్వరగా అంతమైపోతే బాగుండును! శ్రీవర్ధనుడు హీనస్వరంతో నువ్వు కూడా నన్ను గుర్తించలేదా ? "అని నీరసంగా చారుగుప్తుని వంక చూశాడు.

వాని చూపులతో గుర్తింపు బదులు జాలి కరుణ నిండి ఉన్నాయి. ఆ పైన అతడు సేవకుని వంక తిరిగి " పాపం! నిజంగా యీదురదృష్ట జీవి ఉన్మత్తుడే. వీనిని బయటకు తీసుకుపోయి దుస్తులు, ఆహారం యిచ్చి యీ రాత్రికి భవనంలో తలదాచు కోనివ్వండి. ఈ నిర్భాగ్యజీవికి మనస్సు కుదుట పడికష్టాలు తీరిపోవాలని కోరుతున్నాను, వీని ఎడల ప్రతి సేవకుడు ఆదరము ప్రేమ చూపనలసిందిగా హెచ్చరిస్తున్నాను జాగ్రత్త!" అని పలికాడు.

తనను సామాన్యుని వలె వెర్రివానిలాగ భావించి మాట్లాడుతున్న చారుగుప్తుని చూసి రాజుకి ఆగ్రహం మిన్ను ముట్టింది. వానిని క్రూరచిత్తుడని, చేసినమేలును మరచిన కృతఘ్నుడని చక్రవర్తిని మరచిన పాపి అని అనేక విధాల దూషిస్తూ తక్షణమే ఆ చోటు విడిచి అరణ్యంలోకి దూసుకు వెళ్ళి పోయాడు."ఈసారి చక్రవర్తి శ్రీవర్ధనుని కలుసుకున్నప్పుడు తప్పకుండా యీపిచ్చి వానిని గురించి చెప్పాలి" అనుకున్నాడు కలతపడిన మనస్సుతో చారుగుప్తుడు.

-సశేషం

PRICE LIST

# సమర్థ సద్గురు పబ్లికేషన్స్

## శ్రీ కాళీగార్డెన్స్ - 522508, నంబూరు

## గుంటూరు జిల్లా. ఫోన్: 08632293206

**తెలుగు పుస్తకములు:**

| | | |
|---|---|---|
| 1. శ్రీ భగవద్గీత సాధనా దీపిక | 3 భాగములు | రూ: 120.00 |
| 2. శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర | 1వ భాగము | 90.00 |
| 3. శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర | 2వ భాగము | 100.00 |
| 4. శ్రీ బాబూజీ | | 80.00 |
| 5. శ్రీ గురుగీత | | 80.00 |
| 6. స్తోత్రమంజరి | | 60.00 |
| 7. శ్యామసుందరా ఒక్కసారి.... | | 40.00 |
| 8. సంత్‌నామదేవ్ | | 50.00 |
| 9. వార్తాలాపము | 1వ భాగము | 50.00 |
| 10. వార్తాలాపము | 2వ భాగము | 50.00 |
| 11. భక్తికుసుమాలు | | 40.00 |
| 12. భజనమాల | | 70.00 |
| 13. భజనమాల | 1వ భాగము | 25.00 |
| 14. గురువాణి | 1వ భాగము | 25.00 |
| 15. గురువాణి | 2వ భాగము | 10.00 |
| 16. గురువాణి | 3వ భాగము | 25.00 |
| 17. శ్రీ బాబూజీ బోధామృతం | 2వ భాగము | 10.00 |
| 18. శ్రీ బాబూజీ బోధామృతం | 3వ భాగము | 10.00 |
| 19. శ్రీ బాబూజీ దివ్యస్మృతులు | 2,3,6,7 భాగములు | |
| | ఒక్కటికి | 10.00 |
| 20. శ్రీ బాబూజీ దివ్యస్మృతులు | 8,9 భాగములు | |
| | ఒక్కటికి | 15.00 |
| 21. సద్గురు లేఖ సుధ | | 10.00 |
| 22. ధ్యాన శ్లోకమంజరి | | 20.00 |
| 23. తత్వార్థచంద్రిక | 1వ భాగము | 15.00 |

| | | |
|---|---|---|
| 24. తత్వార్థచంద్రిక | 2వ భాగము | 25.00 |
| 25. కైలాస మానస సరోవరయాత్ర | | 20.00 |
| 26. బాబుమాట అమ్మనోట | | 15.00 |
| 27. ధ్యానం | | 15.00 |
| 28. స్తుతి మంజరి | | 20.00 |
| 29. గురుధ్యానదీపిక | | 15.00 |
| 30. గురురామకోటి | | 10.00 |
| 31. శ్రీ గురుగీత | | 10.00 |
| 32. భక్తిపుష్పము | | 10.00 |
| 33. శ్రీ బాబూజీ సహస్రనామాలు | | 8.00 |
| 34. శ్రీ మాతాజీ సహస్రనామాలు | | 8.00 |
| 35. సుప్రభాతం - ప్రార్థన | క్రొత్తది | 6.00 |
| 36. సుప్రభాతం - ప్రార్థన | పాతది | 4.00 |
| 37. బాబు తత్వం అమ్మనోట | | 5.00 |
| 38. నమస్కార స్తోత్రం | | 5.00 |
| 39. ముకుందమాల | | 5.00 |
| 40. శ్రీ దేవీ స్తోత్రరత్నమాల | | 5.00 |
| 41. దివ్యసన్నిధి | | 5.00 |
| 42. గురువే భగవంతుడు | | 5.00 |
| 43. ప్రార్థన - సుప్రభాతం | హిందీ | 5.00 |
| 44. చిన్న పుస్తకములు | ఒక్కటికి | 2.00 |
| 45. శ్రీజగన్మాతపూజా విధానం | | 40.00 |

**ENGLISH BOOKS**

| | | |
|---|---|---|
| 1. Divine memories of Sri Babuji | 2parts each | 10.00 |
| 2. Divinity in Human Form | | 10.00 |
| 3. Guru is God | | 5.00 |
| 4. Gospel of Meditation | | 10.00 |
| 5. Samardha Sadguru | | 50.00 |
| 6. Small books | each | 2.00 |

# మహంకాళీదేవి ప్రతిష్ఠ

- రమణ ప్రసాద్

ది.21-8-2013న శ్రీమాతాజీవారు కట్టమూరు గ్రామంలో మ మహంకాళీ దేవి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా యాగము, సత్సంగ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలలో శ్రీ మాతాజీ వారు చేసిన అనుగ్రహ భాషణలోని సారాంశాన్ని యిక్కడ ప్రచురిస్తున్నాము.....

- ఎడిటర్

శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణీ
సర్వస్యార్తి హరే దేవీ నారాయణీ నమోస్తుతే

ఆ తల్లి మనం నోచే నోములకెంత ఫలమో యిలలోన తులతూచి యిచ్చే కరుణామయి కామితార్థ ప్రదాయిని. అన్ని నామాలూ ఆమెవే. కాత్యాయని, దుర్గా, సర్వమంగళా, కాళీ, యివన్నీ ఆ తల్లి పేర్లే.

మహంకాళీ అంటే అందరూ భయపడతారు. ఆమె ఎవరినీ భయపెట్టదు. ప్రశాంతంగా ఉంటుంది. బలులను కోరదు. కాని మీకు అడ్డుగా వచ్చే గుణాలను బలి తీసుకుంటుంది. అమ్మకు మనం ఏమీ చెప్పక్కర్లేదు. ఆమె మనకు ఏది కావాలో అది ప్రసాదిస్తుంది.

ఉ. అమ్మలఁగన్నయమ్మ ముగురమ్మలమూలపుటమ్మ చాల పె
ద్దమ్మ సురారులమ్మ కడురాఁడిపుచ్చినయమ్మ తన్ను లో
నమ్మిన వేల్పుటమ్మలమనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్ ॥

అమ్మ లేకుండా సృష్టి లేదు. శరణు పొంది ఆర్ద్రంగా పిలిస్తే రక్షించే తల్లి. ఆమె కంటికి రెప్పలేదు. ఆమెను తలిస్తే చాలు తప్పక తరలి వస్తుంది. అందరి ఆర్తిని బాపే తల్లి. దుర్గా భవాని, బ్రహ్మ విష్ణు శివాత్మికా ఆమె. 'అ' అంటే బ్రహ్మ బీజము, 'మ' అంటే అమృత బీజము బ్రహ్మామృతాన్ని ప్రసాదించేది, మీ మనస్సును అంతర్ముఖం చేస్తే మీ హృదయంలో ప్రకాశిస్తుంది.

శ్రీమందడి పున్నయ్యగారు, అచ్చాయమ్మగార్ల ఏకైక కుమారుడైన శ్రీనివాస్ వారి భార్య శైలజ యీ ఆలయాన్ని నిర్మించి, శ్రీమహంకాళిదేవి విగ్రహ ప్రతిష్ఠ చేయ తలపెట్టారు. అమ్మ చల్లని దీవెనలు వారిపై ప్రసరించుగాక!

"సత్సంగత్వే నిస్సగంత్వం నిస్సంగత్వేన నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః"

ఇది ఆదిశంకరులవారి భజగోవింద స్తోత్రంలోనిది. సత్సంగం చేయటానికి జనం అవసరం లేదు. సత్సంగం అంటే సత్యవస్తువుతో కూడి ఉండటం. కాబట్టి మనం ఎప్పుడూ సత్సంగంలోనే ఉన్నాం. ఆత్మవస్తువనే చైతన్యంతో ప్రతిదీ కూడి ఉన్నది. ఆ చైతన్యం వల్లనే ప్రాణ సంచారం జరిగి మనకి ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా తెలుస్తోంది. మనం లోపలికి తీసుకునే గాలిని 'పూరకం' అని, బయటకు వదిలే గాలిని 'రేచకం' అని అంటారు. లోపలికి తీసుకున్న గాలిని బయటకు వదలకుండా కుంభించే ప్రక్రియను 'కుంభకం' అంటారు.

వాల్మీకి ఎన్నో సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆయన మీద చీమలు పుట్టలు పెట్టాయి. ఆ పుట్టలలో పాములు చేరాయి. అయినా ఆయన చలించ లేదు. వారు ఏ ముద్రలో ఉన్నారు? ఆయన మనసు ఎక్కడ నిలిచింది? గురుదేవుడు యిచ్చిన లక్ష్యార్థం మీదనే నిలిచింది. ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఆగిపోయాయి. ఆయన ఉన్నది గురుముద్రలో.

మనం చైతన్యాన్ని ఆశ్రయించి ఉన్నాము. కాని, అది కంటికి కనిపించదు. కరెంట్ కూడా కంటికి కనిపించదు. కరెంట్ ఉండబట్టే ఫ్యాన్ పనిచేస్తుంది. అలాగే భగవంతుడు సర్వవ్యాపకుడు. ఉన్నది సత్యమొక్కటే. దాన్ని గుర్తించటం మానవుని మనస్సుపైన ఆధారపడి ఉన్నది. మానవుడు తన స్వభావాన్ని మార్చుకోవాలంటే మహాత్ములను ఆశ్రయించాలి. వారు చెప్పింది ఆలకించాలి. ఆచరించాలి. అనుభవించాలి. మల్లెపువ్వు ఎలా సుగంధాలు వెదజల్లుతుందో, వారి వాక్కులు అలా సుగంధాలను వెదజల్లి, మనలోని దోషాలను రహితం చేస్తాయి.

అమ్మ విగ్రహాన్ని చెక్కేవాడు రాయిలోని అక్కర్లేని భాగాలను తీసేస్తే అమ్మరూపం వచ్చింది. అలాగే గురుదేవుడు రాయిలా ఉన్న మనసును ఎలా చెక్కాలో అలా చేసి, 'నా స్వరూపం యిది రా!' అని చూపిస్తాడు.

అందుకనే శ్రీ శంకరాచార్యులవారు 'ఓ మూఢమతే! గోవిందుని భజించు. అంత్యకాలం సమీపించినప్పుడు వృథా ప్రసంగాలు నిన్ను తరింప జేయలేవు" అంటున్నారు.

శ్రీగురుదేవులు వారి ప్రతిచర్యలోనూ మనకు శిక్షణ యిస్తారు. ఒకసారి వారు స్నానానికి చిన్న చెంబు పెట్టారు. 'అదేమిటి బాబూ!' అని అడిగితే, "స్నానానికి చిన్న చెంబు పెట్టినందువల్ల, చాలాసార్లు భగవన్నామం జరిగింది" అన్నారు.

ఇక్కడ మనం అమ్మను గురించి మాట్లాడుకుంటున్నాము. మన వృత్తి ఏకీకారం అయింది. అంటే అది కర్మలో అకర్మ అయింది. మనసు నిస్సంగత్వం చెందింది. భగవంతుని దివ్యచరణారవిందములపై మనసు ఆగితే మోహ మాయ తొలగి, నిశ్చలతత్వం వస్తుంది. గాలిలేని చోట దీపం ఎలా ఉంటుందో అలా మనసు నీ ప్రభువు మీద నిలిచిపోతుంది. నిశ్చలతత్వం పొందగానే జీవన్ముక్త స్థితి లభిస్తుంది. ఆ స్థితిని నువ్వు బ్రతికి ఉండగానే పొందాలి. అటువంటి జీవన్ముక్తస్థితిని ప్రసాదించేది గురునామస్మరణ.

నిత్యం సత్యం జ్ఞానమనంతం। సత్య జ్ఞానంద మయీ మా।

నీలో ఉన్న దివ్య శక్తే జగన్మాత. దాన్ని ఆశ్రయించు. భగవంతుని గుణాలను అలవరచుకో! భగవంతునిలో లేని గుణాలను తీసేసుకో! మృత్యువు నుండి అమృతత్వాన్ని పొందు. సత్యవస్తువును గుర్తించు. మనం సత్యంలోనే ఉన్నాము. తమస్సు అనే చీకటి నుండి వెలుగులోకి రా.

అమ్మకి జలాధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం చేయిస్తున్నప్పుడు ఒక బుడ్డాడిని కూడా పడుకోపెట్టారు. ఎవడు వాడు? అతడు రాక్షసుడు. సృష్టి అంతా అమ్మే. మరి వాడు ఆమె బిడ్డ కాదా? భావన ద్వారా మానవుడో దానవుడో తెలుస్తుంది. రాక్షసుడైనా 'భయం లేదురా! నీకు అభయమిస్తున్నాను' అంటుంది అమ్మ.

అటువంటి కన్నతల్లి జగజ్జనని మనలను కడుపారబుచ్చెడి అమ్మ! మనం జగన్మాత ఒడిలోనే ఉన్నాము. జ్ఞానక్షీరాలను త్రాగుతున్నాము. జగన్మాత అట్టి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి రక్షించుగాక!!

# భగవానుడు మనకెంత దూరం? – వశిష్ఠ

(1982సంవత్సరం దసరామహోత్సవాలలో స్వామి దివ్యబోధ)

నేడు విజయదశమి. జగన్మాత కృపా కటాక్షమును కోరి యిన్ని రోజులుగా ఆమెను ఆరాధిస్తున్నాము. ఆమె అనుగ్రహానికి, మనకు మధ్య మాయ లేక అజ్ఞానము అడ్డుగా నిలచి ఉన్నంతకాలము,



మనకు శాంతి ఉండదు. ఈ అజ్ఞానము నుండి – మాయ నుండి మనలను రక్షించ గల వారెవరు? ప్రత్యక్ష పరమేశ్వరుడైన గురుదేవుడు తప్ప ప్రపంచంలో మరెవ్వరూ యీ పని చేయజాలరు. మాయను జయించి, నిరంతరం ఆత్మానందాన్ని అనుభవిస్తూ ఉంటారు గురుదేవులు. భగవదనుగ్రహం సంపాదించటం ఎట్లో ఆయన మనకు బోధించగలరు. ఆయన గుణాతీతుడు, ప్రేమ స్వరూపుడు గురుదేవుడు. నిర్దుష్ట ప్రకాశ స్వరూపులు. జనన మరణ రూప సంసారమను మహావ్యాధి నుండి మనలను కాపాడగల మహా భిషగ్వరుడు అతడే.

లోకంబులు లోకేశులు లోకస్థులు,తెగిన తుదినలోకంబగు పెంజీకటి
కవ్వల కెవ్వండేకాకృతి వెలుగు నతనిని నే సేవింతున్

అని తెలుగు మహాభాగవతంలో శ్రీ బమ్మెర పోతనామాత్యుడు వ్రాసినాడు. ఇది గజేంద్ర మోక్ష గాథలోనిది. ఈ పద్యములో వర్ణితమైన మహాకాశపు నడికొప్పు దూరం 55వేల కాంతి సంవత్సరాలు. కాంతి అనేది సెకనుకు 1,86,000 మైళ్ళు ప్రయాణం చేస్తుందని భౌతిక శాస్త్రజ్ఞులు లెక్కవేశారు. కాంతి సంవత్సరపు దూరమంటే ఒక సంవత్సరంలో ఎన్ని సెకెండ్స్ ఉంటాయో అన్ని లక్షాఎనభైఆరు వేల మైళ్ళ దూరమన్నమాట. ఇట్టి కాంతి సంవత్సరాలు 55వేలు అయితే తప్ప మన చుట్టూ ఉండే యీ మాహాకాశపు అంచు దూరం లెక్కతేలదు. ఇది మనసుకు ఎంత విభ్రమం కొలిపే దూరమో తేలికగా ఊహించుకోవచ్చు.

పరమాత్ముని వెలుగు దర్శించుకోవటానికి యీ దూరాన్నంతటిని దాటిపోవాలి. నేటి భౌతిక విజ్ఞాన శాస్త్రజ్ఞులు కనుగొన్న అత్యంత వేగవంతమైన రాకెట్ వేగం కాంతి సంవత్సర వేగంలో 8వ వంతు మాత్రమే.

ఇట్టి పరిస్థితిలో ఆ రాకెట్‌లో మనం ప్రయాణం చేసినప్పటికి మహాకాశపు అంచు చేరుకోవటానికి 4,40,000 సంవత్సరాలు పడుతుంది. వాస్తవానికి అంత దూరం నిరుపద్రవంగా ప్రయాణించగల యంత్రాన్ని యింకా ఎవరూ కనుగొని ఉండలేదు. కాని మానవుడు కనులు మూసుకుని భగవంతునిపై తన మనసు నిలుపగలిగిన యెడల యింత దూరము ఒక్క క్షణంలోనే దాటివేయ గలడు. పోతనామాత్యుడు అట్లే చేయగలిగాడు.

కృష్ణభక్తులైన ఒకానొక పుణ్య దంపతులకు యోగ్యుడైన ఒక కుమారుడు ఉన్నాడు. వాడిని వాళ్ళు బడిలో వేశారు. ఆ బడి వారి గ్రామానికి చాల దూరంలో ఉంది. మధ్య ఒక దట్టమైన అడవి. ఆ బాలుని తల్లి కుమారుడితో – "నాన్నా! యీ అడవిని చూసి నీవేమీ భయపడకు. నీకు ఎప్పుడైనా భయం కలిగితే 'కృష్ణా!' అని కేక వేయి. కృష్ణుడు మీ అన్నయ్య. ఆ అడవిలోనే ఉంటూ ఉంటాడు. వెంటనే వచ్చి నీకు తోడ్పడతాడు" అని చెప్పింది. నాటి సాయంత్రం ఆ బాలుడు బడి నుంచి తిరిగి వస్తూ ఉండగా చీకటి పడింది. ఆకాశంలో మబ్బులు కమ్మి గాలి రాగాసాగింది. బాలుడికి భయంవేసి తల్లిమాట జ్ఞాపకం రాగా 'కృష్ణన్నయ్యా! ఎక్కడ ఉన్నావు? త్వరగా రా. నాకు భయంగా ఉంది' అని అరిచాడు. ఆ అన్నయ్య మారు పలుకకపోయే సరికి మరింత తీవ్ర స్వరంతో కేకపెట్టాడు. ఆ పిలుపు ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుడికి వినబడింది.

గజేంద్రుడి కేక వైకుంఠానికి వినిపించినప్పుడు, బాలుని కేక ద్వారకకు ఎందుకు వినబడదు? సమస్త కామనాలనూ అతిక్రమించి మనసు భగవత్ చరణార విందముల యందు లగ్నమైనప్పుడు పెట్టిన కేక ఉత్తర క్షణంలోనే భగవంతుడికి అంది వెంటనే ఆయన మన రక్షణకు రావటం నిశ్చయం.

కాబట్టే ఆ బాలుడి పిలుపు విని, వెంటనే వచ్చేశాడు. తన మధుర సంభాషణతో వానికి ప్రియం కల్పిస్తూ, వాడి యింటివరకు తీసుకు వచ్చాడు. పిలవగానే తను ప్రతిదినం యిలాగే కనిపిస్తానని కూడా అభయం యిచ్చి వెళ్ళిపోయాడు. కుమారుని వల్ల యీ కథంతా వినగానే ఆ తల్లిదండ్రులు తమ కుమారుడికి కలిగిన యీ ప్రత్యేక భాగ్యానికి ఆనంద బాష్పపూరిత లోచనులైనారు. దేవతలకైనను అట్టి భాగ్యము కలుగుట దుర్లభము కదా!

–సశేషం

## కృష్ణా మా యింటికి రావో......

– రమణ ప్రసాద్

### శ్రీకృష్ణుడు యశోదకు విశ్వరూపం చూపించుట

మన్ను తింటివటంచు తల్లి నిన్నదిలింప
విశ్వరూపము నోట వెలయించినా స్వామీ॥
కృష్ణా మా యింటికి రావో ॥



అలా జరిగిన కొంతకాలానికి, ఒక రోజు బలరాముడూ మరి కొందరు గోపబాలురూ కలిసి పరుగు పరుగున యశోదను సమీపించి, " అమ్మా! మన కృష్ణయ్య మన్ను తింటున్నాడ"ని ఫిర్యాదు చేయగా, యశోద వెంటనే కృష్ణుడు ఉన్నచోటికి వెళ్ళి అతనితో-

క॥ మన్నేటికి భక్షించెదు
మన్నియమము లేల నీవు మన్నింపవు నీ
యన్నయు సఖులును జెప్పెద
రన్నా మన్నేల మఱి పదార్థము లేదే ॥

"నాయనా! మన్నెందుకు తిన్నావు? నేను చెప్పిన మాటలలను ఎందుకు వినవు? ఈ అన్న, నీ స్నేహితులు నువ్వు మన్ను తిన్నావని చెప్పారు. మన్ను తినటం ఏమిటి? మరి వేరే పదార్థము లేదా?" అని అడిగింది.

ఆమె పలుకులు విని కృష్ణయ్య, అసలు మన్నంటేతనకు తెలియనట్లుగా-

శా॥ అమ్మా! మన్ను దినంగ నే శిశువునో, యాఁకొంటినో, వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరి మటలు మదిన్ నన్నీవు కొట్టంగ వీ
రిమ్మార్గమ్ము ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీయాస్య గం
ధమ్మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పెన దండింపవే ॥

కృష్ణుడు ఇలా అన్నాడు " అమ్మా! నేనేమైనా చిన్నవాడినా? వెఱ్ఱివాడినా? లేక ఆకలితో అలమటిస్తున్నానా? నువ్వు వీరి మాటలు నమ్మవద్దు. నువ్వు నన్ను కొట్టాలని నా పై కల్పించి చెప్పారు. నా నోటి వాసన చూడు. నా మాట అబద్ధమైతే నన్ను శిక్షించు" అని తన నోరు తెరిచి చూపాడు.

బాలుని ముఖం చూడగానే యశోద అమితాశ్చర్యం పొందింది.

అతని మపఖ గహ్వరంలో, ఆమెకు భూమ్యాకాశాలూ, పర్వతాలూ, సముద్రాలూ, ద్వీపాలూ, సూర్యచంద్రాదులూ, ఇది అది అననేల, బ్రహ్మాండ మంతా గోచరించింది. అంతేకాదు, తనూ, తను ఉన్న గోకులమూ, అందులో ఉండే సకల ప్రాణులూ ఆ నోటిలో ఆమె చూచింది.

మ॥ కలయో వైష్ణవమాయయో యితర సంకల్పార్థమో సత్యమో
తలపన్ నేరక యున్నదాననో యశోదాదేవిఁకానో పర
స్థలమో బాలకుఁడెంత యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర
జ్వలమై యుండుట కేమి హేతువో మహాశ్చర్యంబు చింతింపగన్ ॥

ఏమాశ్చర్యం? ఎంత అద్భుతం? నేను చూస్తున్నది కలా? నిజమా? లేక ఇది విష్ణుమాయ ఏమో! లేక నేను భ్రమ పడుతున్నానా? లేక నా ఆలోచనా శక్తి లోపించిందా? నేను యశోదాదేవినేనా? ఇది నా ఇల్లేనా? లేక పర స్థలమా? ఈ బాలుడు చూస్తే చిన్నవాడు. వీడి నోట్లో ఈ బ్రహ్మాండం ప్రకాశించటం ఎలా సంభవమో? చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది.

ఆ॥ బాల మాత్రుఁడగు సలీలుని ముఖమునందు
విశ్వమెల్ల నెట్లు వెలసి యుండు
బాలు భంగి నితఁడు భాసిలుఁగాని స
ర్వాత్ముఁడాది విష్ణుఁ డగుట నిజము ॥

ఈ బాలుని రూపంలో ఉన్న లీలా మానుషుని నోట ఈ విశ్వమంతా ఎలా వెలిసిందో కదా! బాలునిగా కనిపిస్తున్నాడు. కాని నిశ్చయంగా ఇతడు సర్వాత్ముడైన విష్ణువే! సందేహం లేదు.

అలా గుర్తించిన యశోద విష్ణుమాయ చేత తన యెఱుకను కోల్పోయి, తన పుత్రుడిని "నా నాన్నా!" అని తొడపై పెట్టుకొని ముద్దాడింది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన చీమకుర్తి సీతారామబ్రహ్మ గుప్తాగారు 10-9-13 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక! వీరు కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# 50వ కృష్ణ జన్మాష్టమి స్వర్ణోత్సవ నివేదిక

– రమణ ప్రసాద్

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి పరమానుగ్రహంతో, పూజ్యశ్రీ యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీవారి ఆధ్వర్యంలో ది 27.8.13 మంగళవారం నుండి ది.2.9.13 సోమవారం వరకు శ్రీ భాగవత. అఖండనామ సప్తాహ త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళన సహిత శ్రీకృష్ణాష్టమి స్వర్ణోత్సవాలు శ్రీకొండ శేషంరాజు కృష్ణవేణి స్మృత్యర్థం అత్యంత వైభవంగా జరిగాయి.



ఈ ఉత్సవాలు వారి కుటుంబ సభ్యులు ఎంతో ఘనంగా చేసుకున్నారు. శ్రీ శేషంరాజు దంపతులకు ముగ్గురు కుమారులు ఇద్దరు కుమార్తెలు కలరు. మొదటికుమారుడు – వెంకటరాజుగారు (భార్య–జ్ఞాన కుమారి); రెండవ కుమారుడు – అశోక్ కుమార్ వర్మ (భార్య మంజూష); మూడవ కుమారుడు – కుమారస్వామి రాజా ( భార్య –కోమలి); మొదటి కుమార్తె హేమలత (భర్త–మావులేటి వెంకట్రామరాజు); రెండవ కుమార్తె – ప్రేమలత (భర్త – మావులేటి సీతారామరాజు). శ్రీకృష్ణమూల మంత్రంతో జరిగిన యాగంలో వీరితో పాటు, మావులేటి సోమరాజు (భార్య అరుణ), సోం ప్రసాద వర్మ ( భార్య భాను పద్మజ కాళి) ప్రధాన కర్తలుగా పాల్గొన్నారు.

ఐదు గుండాలతో ఏర్పపబడిన యజ్ఞ వేదికలో మూడు గుండాలు భక్తులకోసం ప్రత్యేకించి భక్తులు కూడా యాగంలో

పాలు పంచుకొనే అపూర్వ అవకాశాన్ని ఈ కుటుంబం వారు కల్పించారు. ఈ యాగశాల అతి తక్కువ వ్యవధిలో నిర్మింపబడినది. యాగ పూజాది కార్యక్రమాలు బ్రహ్మ శ్రీ కొండూరి రామ సుబ్రహ్మణ్య శర్మ గారి అధ్వర్యంలో జరిగాయి.

50 సంవత్సరాల క్రితం 1964లో శ్రీ కొండ శేషంరాజు, కృష్ణవేణి దంపతులకు శ్రీవారు ప్రసాదించారు. శ్రీబాబూజీ మహరాజ్ వారి దివ్యాశ్శీస్సులతో మొదటిసారిగా విజయవాడలో ప్రారంభింప బడిన శ్రీకృష్ణ జన్మాష్టమి మహాత్సవాలు ఈనాటి వరకు నిరాఘూటంగా, నిర్విఘ్నంగా కొనసాగాయి, యిక ముందు కొన సాగుతాయి.

శ్రీ శేషంరాజు దంపతులు 1972లో ఆశ్రమ స్థాపన జరిగిననాటినుంచీ ఈ ఉత్సవాలు ఆశ్రమంలో జరుగుతున్నాయి. 1980లో ప్రణవస్థిత శ్రీరాధాకృష్ణ యుగళమూర్తుల ప్రతిష్ఠ శ్రీబాబూజీ మహరాజ్ వారు చేసినప్పటినుంచీ వారు ఈ ఆలయంలో కలశస్థాపన చేసి ఈ ఉత్సవాలను జరుపుతూ వచ్చారు. 1998లో శ్రీకృష్ణవేణమ్మగారు, 2000లో శ్రీ శేషంరాజుగారు శ్రీ గురు సాయుజ్యాన్ని పొందిన తరువాతనుంచి వారి సంతానం ఈ ఉత్సవాలను జరుపుతున్నారు

ఇక ఈ ఉత్సవాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు :

యాగ కార్యక్రమం –

సాప్తాహిక శ్రీకృష్ణ మూల మంత్ర హెూమము; అవధూతేంద్ర మండలి, పావులూరు నుండి శ్రీరామంగారి శ్రీరామనామక్షేత్రం, గుంటూరు నుండి శ్రీరామ పిచ్చయ్యగారి బృందము వారిచే అఖండ హరే రామ నామ సప్తాహం. ఈ కార్యక్రమానికి విరమణ శ్రీ మాతాజీ వారు 3.9.2013 ఉదయం చేశారు.

ప్రతిరోజు ఉదయం ప్రార్థనలో శ్రీమద్భగవద్గీత పారాయణ; శ్రీశ్రీనివాస రామానుజదాస్ గారిచేత భాగవత ప్రవచనం; శ్రీ సద్గురు దేవుల పాదపూజ – ఆగస్ట్ 27న ఉదయం 11 గం.లకు; 29,30,31 తేదీలలో ఉదయం 5గం.30నిలకు; సెప్టెంబర్ 2న సాయంత్రం

6గం.లకు జరిగింది. 28న సాయంత్రం 7 గం. శ్రీరాధాకృష్ణ సామూహిక కళ్యాణములు,సెప్టెంబర్ 2వ తేదీన రాత్రి 8గం.30నిలకు ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది.

ఆగస్ట్ 30 నుండి సెప్టెంబర్ 1వ తేది వరకు శ్రీశ్రీశ్రీ దండి నిర్మలానందగిరి స్వామి వారి (శ్రీ అష్టలక్ష్మీ పీఠాధిపతులు, తెనాలి) అధ్వర్యంలో మూడురోజులు సాధు ధర్మ సమ్మేళనం జరిగింది.

ఈ సమ్మేళనంలో - శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామి, శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీకాళహస్తి; ఆచార్య పరిశుద్ధా నందగిరి స్వామి, పరాశరాశ్రమం, హైదరాబాద్; ఆచార్య శంకరానందగిరి స్వామి,అఖిలాంధ్ర అధ్యక్షులు, శ్రీ పరమాత్మానంద ఆశ్రమం, పెనమలూరు; శ్రీ స్వస్వరూపానందగిరి స్వామి, శ్రీ వసిష్టాశ్రమాధిపతులు; డా॥ కరిబసవ రాజేంద్ర మహాస్వామి, గవి మఠం మహాసంస్థాన ఉత్తరాధికారి, ఉరవకొండ; శ్రీ వాసుదేవానంద గిరి స్వామి, శ్రీవిద్యా పీఠాధిపతులు, పెదపులిపాక; శ్రీనిత్యానంద భారతి స్వామి, శ్రీగురు మందిరం,బళ్ళారి; శ్రీ సంపూర్ణానంద గిరిస్వామి, శ్రీ శుకబ్రహ్మాశ్రమ ఉత్తరాధికారి; శ్రీమాతా జ్యోతిర్మయా నంద భారతి, శ్రీషణ్ముఖ ఆశ్రమం, పాలకొల్లు; శ్రీమాతా త్యాగీశానందపురి మాతాజీ, శ్రీరామకృష్ణ భక్త సమాజం, బాపట్ల; శ్రీమాతా ప్రతిభానందగిరి మాతాజీ, శ్రీభూమానంద ఆశ్రమాధి పతులు, గండి క్షేత్రం; శ్రీమాతా శివ చైతన్య మాతాజీ, చైతన్య తపోవనాధిపతులు, తాడేపల్లి.

ఈ సాధుమహాత్ములు, మాతాజీలు మూడురోజులుగా జరిగిన ఈ సాధు సమ్మేళనానికి విచ్చేసి తమ అమూల్య ఆధ్యాత్మిక సందేశాలను అందించారు. శ్రీమాతాజీ వారు తమ అనుగ్రహ భాషణాన్ని ప్రతి మహాసభలోను అందించి భక్తులందరినీ అలరించారు. సెప్టెంబర్ 1న ఈ సాధు ధర్మ సమ్మేళనం ముగిసింది. సెప్టెంబరు 2న శ్రీరాధా కృష్ణ సహస్ర నామార్చన; పూర్ణాహుతి; శ్రీభాగవత ప్రవచనానికి స్వస్తి; శ్రీరుక్మిణీ కళ్యాణ మహోత్సవం

జరిగాయి.

ఈ స్వర్ణోత్సవానికి విచ్చేసిన అసంఖ్యాకమైన భక్తులకు తగిన వసతి సదుపాయాలు ఈ కార్యక్రమ నిర్వాహకులు చేశారు. ప్రతిరోజు ఉదయం భోగ ప్రసాదము; మధ్యాహ్నం 12 గం.లు, తిరిగి 8 గం.లకు మహాప్రసాద వితరణ జరిగింది.

క్షణం తీరిక లేకుండా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు కాలగమనం తెలియకుండా గడిచిపోయాయి. యాగంలో భాగంగా శ్రీకుమారస్వామిరాజా,కోమలి దంపతులు దశదానాలు చేశారు. ఇవి – గోదానము, భూదానము, సువర్ణదానము, రౌప్యదానము, తిలదానము, ఆజ్యదానము, వస్త్రదానము, దాన్యదానము, గుడదానము, లవణదానము.

"ఒక కార్యక్రమాన్ని 12 సంవత్సరాలు చేస్తే సత్ఫలితాలు కలుగుతాయి. అటువంటిది కొండ శేషంరాజు గారి వంశజులు 50 సంవత్సరాలుగా ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ ఉత్సవాలను ప్రతి ఏడు ఇనుమడంచిన ఉత్సాహంతో జరుపుతున్నారంటే వారికి శ్రీ కృష్ణదేవుల కరుణ, శ్రీగురుదేవుల అనుగ్రహం లభిస్తాయి అనటంలో ఏ మాత్రం సందేహం లేదు" అని సాధు మహాత్ములు అన్నారు.

ఈ కార్యక్మాలన్నిటిలో శ్రీ కుమారస్వామి రాజా, వారి సతీమణి కోమలి పాల్గొని అన్ని కార్యక్రమాలు దివ్యంగా భవ్యంగా ముగిసేటట్లు చూశారు. " మీరు ఇన్ని కార్యాలను ఇంత సమర్ధవంతంగా ఎలా చేయగలిగారు? అని అడిగితే, శ్రీరాజా నవ్వుతూ "నిశ్చయంగా గురుశక్తే చేయించింది" అన్నారు.



# శ్రీకృష్ణుని బాలలీలలు

- రమణ ప్రసాద్

ప్రాత సమయ్ దధి మథతి జశోదా

అతి సుఖ్ కమల్ -నయన్ - గున్ గావతి ।

అతిహి మధుర్ గతి , కంఠ్ సుధర అతి,

నంద - సువన్ చిత్ హితహి కరావతి॥

నీల్ బసన్ తను, సజల్ జలద మను,

దామిని విధి భుజ - దండ్ చలావతి ।

చంద్ర - బదన లట్ లటకి ఛబీలీ,

మనహు అమృత రస బ్యాలి చురావతి॥

గోరస్ మథత నాద్ ఇక్ ఉపజత,

కింకిని -ధుని సుని శ్రవన రమావతి ।

సూర శ్యామ్ అఀచరా ధరి ఠాడే,

కామ్ కసౌటీ కసి దిఖరావతి ॥

ప్రాతఃకాలంలో యశోద పెరుగు చిలుకుతూ ఎంతో ఆనందంతో కమలనయనుడైన తన కుమారుని గుణములను శ్లాఘిస్తూ పాడుతోంది. ఎంతో శ్రావ్యంగా తన మధురమైన కంఠంతో నందనందనుని తన్మయత్వంతో కీర్తిస్తోంది. ఆమె ధరించిన నీలి రంగు చీర దట్టమైన మేఘాన్ని పోలి ఉంది. విద్యుత్ వేగంతో పెరుగు చిలుకుతున్న ఆమె బుజాలు కదులుతున్నాయి. ఆమె ముఖ బింబంమీద నల్లటి ముంగురులు సర్పాలు అమృత రసాన్ని అందుకోవటానికి కదులుతున్నట్లుగా ఉన్నాయి. పెరుగు చిలుకూతూ ఉంటే వచ్చే గాజుల గల గలలకు ఆమెచెవులకు ఆనందాన్ని



కలిగిస్తోంది.సూరదాసు తల్లి కొంగు పట్టుకొని ఉన్న శ్యామసుందరుని సౌందర్యం ముందు కామ దేవుని అందం వెలవెల పోతోంది అని అంటున్నాడు.

*

# శ్రీరామలింగేశ్వరుని లీల!

- అడబాల వెంకన్న బాబు,
డి. గణపవరం

నేను రెండు రోజులు తేనుపులు, వెక్కిళ్ళు, గ్యాస్ నొప్పితో చాలా బాధ పడ్డాను. పని మీద వేరే ఊరు వెళ్ళినందున సరియైన మందులు వేసుకోకుండా అశ్రద్ధ చేశాను. మూడో రోజు తేనుపులు ఎక్కువై మాట్లాడలేక పోయాను. మంచం మీద ఎగిరెగిరి పడ్డాను. మా నాన్నగారు, మా అమ్మ నా బాధ చూసి వెంటనే నన్ను తణుకు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ డాక్టరుగారు అన్నిరకాల పరీక్షలు చేశారు. సుమారు 20,000 రూపాయులు ఖర్చు అయ్యాయి. కాని అనారోగ్య కారణం నిర్ధారణ కాలేదు. బహుశ గ్యాస్ వలనే వచ్చిందేమో అన్నారు.



నాకు మాట సరిగా రావటం లేదు. మాట్లాడితే నొప్పి, వెక్కిళ్ళు, మంట రావటం జరుగుతోంది. అతికష్టం మీద మా అమ్మతో చెప్పి, ఆశ్రమానికి మాతాజీ గారికి ఫోన్ చేయించాను. ఆవిడ అమెరికాలో ఉన్నారని తెలిసింది. సాయికృష్ణగారికి చెప్పి కబురు చెప్పించాము. వారు వెంటనే నన్ను ఆశ్రమానికి రమ్మనమని చెప్పారు. వారి ఆజ్ఞ ప్రకారం మా అమ్మ, నాన్న, నేను ఆశ్రమానికి చేరుకున్నాము.

శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయంలో నా పేరుమీదుగా మూడురోజులు ఏకాదశ రుద్రాభిషేకం మా వాళ్ళు చేశారు. నన్ను డా॥అశోక్ చూపించారు. డాక్టరు గారు కంగారు పడవద్దని చెప్పి, అన్ని పరీక్షలు చేయించారు. ధైర్యం చెప్పి మందులు యిచ్చారు. శివాలయంలో మూడురోజులు అభిషేకం పూర్తి అయ్యేసరికి మూడోరోజు నాకు మాట పూర్తిగా వచ్చేసింది. సుమారు వారం రోజులుగా మాటరాని నాకు, శ్రీబాబు పరమ అనుగ్రహంతో, మాతాజీవారి ఆశీస్సులతో శ్రీరామలింగేశ్వర స్వామి అభిషేక ఫలంగా నాకు వాక్కును ప్రసాదించారు!

*

# శ్రీ రాధామాధవ రససుధ

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

నా తను మన సర్వస్వం నీదే - నీవే సదా ఏకైక స్వామిని
ఇదే నా సత్య ప్రతిజ్ఞ - ఎన్నడూ ఇవి ఇతరులకు భోగ్యం కావు,
ఇవి ఎన్నడూ భోక్తలు కావు.



నీ సమీపంలో నా స్థూల స్వరూపం ఉండకపోవచ్చు.
కానీ సూక్ష్మశరీరం క్షణం కూడా నిన్ను విడిచి ఉండలేదు. అట్టి స్థితిలో అది అత్యంత అధీర మవుతుంది.

ఇది సదా నీతో కలిసే ఉంటుంది. అందుకై నీ పాద ప్రాంతాలలో ఉంటుంది. నీవే దీని జీవనానికి ఏకైక జీవం అనేది నిస్సందేహం.
అన్యులెవ్వరికీ దీనిపై ఏనాడూ ఏపాటి అధికారం లేదు.
ఏనాడూ ఉండదు. ఎవ్వరికీ ఇది సుఖమివ్వదు. ఏ ప్రకారంగానూ ఎవ్వరి నుంచీ సుఖం స్వీకరించదు.

ఇది ఎప్పుడైనా ఎవరినైనా కించిత్తు ప్రేమిస్తున్నట్లు,
ఎవరైనా ప్రేమిస్తున్నట్లూ కానవచ్చేటట్లయితే
అదంతా కేవలం నీ రసము యొక్క పవిత్ర విస్తరణమే.

నీవు నన్ను ఏదైనా అనవచ్చు. నేను సదా నీ అధీనుడను.
కానీ దయచేసి ఎప్పుడూ అన్యథా భావించకు. నీవు దీనవని ఎప్పుడూ చెప్పకు
అయినప్పటికీ నీ మనస్సు ప్రకారం చేయలేకపోతున్నాను.
అందువలన సంతతమూ నీకు ఖేదము కలిగించే వాడుగనే ఉండిపోతున్నాను

నీవు నీ స్వభావమును తలచి నా అపరాధాలన్నింటినీ విస్మరించు,
నీ పావన పదపంకజ ధూళిని యిస్తూ ఉండు. నన్ను కృతార్థుని చేస్తూ ఉండు.

నీ
శ్యామ సుందరుడు

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

– విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ శేషగిరిరావుగారితో శ్రీబాబు**

ముఖ్య విషయాలన్నిటిలోనూ శ్రీబాబు శేషగిరిరావుగారితో సంప్రదించే వారు. వారి మధ్య మాటలు కంటె, కనుసంజ్ఞలతోనూ, సంకేతాలతోనే ఎక్కువ సంభాషణ నడిచేది. నిర్ణయాలు జరిగిపోయేవి. తదేకమూ, అనన్యమూ అయిన తత్పరత, ఏకాగ్రత గురుని యందు కుదిరితేగాని, అలా గురుదేవుల మనోగత భావాలను కనుసన్నలలోనే గ్రహించ గల శక్తి లభించదు. శేషగిరిరావుగారు కార్య శూరులేగాని, వాగాడంబరంలేదు. ఎవరైనా ప్రదర్శిస్తే సహించేవారు కాదు. ఆ విధంగా శ్రీబాబుకు అనవసర అతిధుల బెడదను తప్పించేవారు. కాని హృదయ పూర్వకంగా శ్రీబాబు అనుగ్రహం కోసం తపించేవారిని ఎంతోఆదరంతో చేరదీసి సహాయపడేవారు. గురు సన్నిధానంలో ఉండవలసిన క్రమశిక్షణను, భయభక్తులను, వినయవిధేయతలను, తత్పరతను బోధించి ఆచరింప జేసే వారు.



శేషగిరిరావుగారికి శ్రీబాబు యెడలగల భక్తి ఎంత పరిపూర్ణమైనదో, అంత గోప్యమైనది, అంతరంగికమైనది. అన్ని విషయాలూ పరస్పర ఆమోదంతోనే జరిగినా, మాటి మాటికీ వారు శ్రీబాబు దర్శనం కోసం వచ్చే వారు కాదు. ఎప్పుడో అరుదుగా ఒక్క సారి రావటం, కొద్ది నిమిషాలలో ఉన్న విషయాలన్నిటికి నిశ్శబ్దపు సంప్రదింపులతో నిర్ణయించటం, వెళ్ళిపోవటమేగాని, నమస్కారాలు లేవు. శ్రీబాబుకు శేషగిరిరావుగారు సాష్టాంగవందనం చెయ్యటం, ఒక్క గురుపూజలో తప్ప, ఎవరూ చూడలేదు. నమస్కారము చేసేటప్పుడు మనస్సు లొంగితే ఫలితం పూర్ణము. శరీరం మాత్రమే. ఒంగితే ఫలితం స్వల్పము. – శ్రీ బాబు ఉవాచ.

ఒకానొకప్పుడు శ్రీబాబు హిమాలయాలకు వెళ్ళిపోతారని పెద్ద

వదంతి బయలు దేరింది. ఆ రోజుల్లో శేషగిరిరావుగారు, చిరంజీవి రాజుగారు ఎవరికీ తెలియని, అంతులేని ఆవేదనను, అనుభవించే వారు. బయటకు మాత్రం తెలియనిచ్చేవారు కాదు, తమ వలెనే ఆవేదన పడుతున్న భక్తులతో మాత్రం శేషగిరిరావుగారు విడివిడిగా మాట్లాడి, వాళ్ళ ఆవేదన ఎంత వరకు ఉన్నదో గ్రహించి, నిజమైన భయాందోళనలు గల వారితో మాత్రమే తమ అవేదనను బహిర్గతం చేసేవారు, "మరి ఆయున వెళ్ళిపోతున్నారని తెలసి కూడా ఊరుకుంటారేం? ఆపేటందుకు ప్రయత్నించరా? ప్రార్ధించరా? నిజంగానే ఆయన మనందరని యిలా విడిచిపోతే, మన గతి ఏమిటి?

'ఏమండీ ! మీ దోవన మీరు వెళ్ళి పోతే మిమ్మల్నే నమ్ముకొని ఆశ్రయంచిన మా అందరి గతి ఏమటి ? మమ్మల్నందరిని ఏం చేసి పోతారు?' అని నిలదీసి అడగండి. ఆయన మనస్సు కరిగేవరకు ఆ పాదాలు వదలకండి " అని హెచ్చరించి అందరిలోనూ తీవ్రత కలిగించారు. అందరి భావాలను, ఆవేదనను ఏకోన్ముఖం చేసి, స్వామిని వెళ్ళనీయకుండ మనందరి మధ్య నిలిపి ఉంచటానికై అనన్య కృషి చేశారు.

శేషగిరిరావుగారు త్యాగధనులు, సవతి తల్లి కుటుంబ రక్షణకై తమ ఆస్తినంతటినీ విడిచి పెట్టారు.వారికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, వైద్యవృత్తిలో ఎంతో పేరు ప్రతిష్టలు గడించినా, ఎవరి వద్ద ఒక పైస కూడా తీసుకొనే వారు కాదు. ఈ సమస్యలన్నిటికీ తోడు ఆయనపై కిట్టనివారు ప్ర యోగం చేశారు. దానితో ఆయన ఎన్నో యిక్కట్లు పడవలసి వచ్చింది. ఒక పిచ్చిగానివలె అయిపోయారు. ఆ సమయంలో శ్రీ బాబు ఆయనకు తోడు నీడగా వెంటనంటి ఉండే వారు. శ్రీ బాబును గురించి తెలియని వారు వారిద్దరిని, "పిచ్చోడు, పిచ్చోడి గురువు " అనేవారు. గురువును వదలని పిచ్చి 'గురు పిచ్చి' (గొప్ప పిచ్చి), అది నిజంగానే మనకు కలిగితే, గురువు మనలను ఎన్నటికీ వదలడు. అంత కంటె ధన్యత్వమేమున్నది?

శేషగిరిరావుగారు ఎన్నడూ తన కుటుంబ సమస్యలను గురించి స్వామితో ముచ్చటించలేదు. నిరంతరమూ స్వామి సేవ,

యితర సమయాలలో తన వైద్య వృత్తితోనే సరిపోయేది. అవసాన దశలోకూడా స్వామినిగూర్చిన చింతనమే, ఎవరు వచ్చినా, వారితో శ్రీబాబు చేజారి పోకుండా ఎలా దక్కించుకోవాలి అనే ఆలోచనమే. దానికి తోడు దైవ పరీక్షలు, శేషగిరిరావుగారు మంచం పట్టి ఉన్న సమయంలోనే, యుక్త వయస్కు డైన వారి రెండవ కుమారుడు హఠాత్తుగా మరణించాడు. అయినా శేషగిరిరావు గారు కంట తడి పెట్టలేదు. విచార రేఖ అయినా ఆయన వదనంలో కనిపించ లేదు. మృతా శౌచమును తాము పాటించ లేదు; ఇంట్లో ఎవరినీ కూడా పాటించనీయలేదు. శ్రీ గురుదేవుల అవ్యాజ పరమానుగ్రహంతో వారు అలవరచుకొన్న స్థితప్రజ్ఞత్వానికి, సంసార నిరాసక్తతకు యిది మచ్చు తునక.

అనన్యాశ్చిన్తయంతోమాం । యే జనాః ప ర్యు పాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం । యోగ క్షేమం వహామ్యహం ॥

అని గీతాచార్యుడొసగిన అభయ వచనానికి నిర్వచన స్వరూపులైన శ్రీ బాబు, శేషగిరిరావుగారి కుటుంబ సమస్యలన్నిటినీ తాము స్వయంగా పరిష్కరించారు. ఆ కార్యక్రమం పూర్తి అయ్యేవరకు శేషగిరిరావుగారిని బ్రహ్మైక్యం పొందకుండా శరీరంతో నిలిపి ఉంచారు.

ఆ రోజులలో అప్పుడప్పుడు శ్రీ బాబు శేషగిరిరావుగారి వద్దకు వెళ్ళి కాసేపు కూర్చుని వస్తూ ఉండేవారు. అలాగే శ్రీబాబు ఒకసారి వారి వద్దకు వచ్చి " శేషగిరి ! నీవు అన్నిటిని వదులుకుని నన్నాశ్రయించావు. అందుకని నేను నీ గృహ సమస్యలన్నిటినీ పరిష్కరించాను. ఇక నీవు నిశ్చింతగా ఉండు" అన్నారు. శేషగిరిరావుగారు మందహాసంతో "బాబూ ! నేనెప్పుడూ నిశ్చింతగానే ఉన్నాను. మీరుండగా నాకేమి చింత బాబూ? నా మనస్సులో తమరి నొక్కరినే నిలుపుకున్నాను. ఇక మరో భావానికి అక్కడ తావులేదు. దాన్ని స్థిరంగా నిలపండి బాబూ ! అది నాకు చాలు" అని ప్రార్థించారు. " తథాస్తు " అని బాబు శేషగిరిరావుగారి గుండెలపై నిమురుతూ ఆశీర్వదించి వెళ్ళిపోయారు.

“ బాబు అంటే ఎవరనుకున్నారు ? ఎన్ని వేల జన్మలు తపస్సు చేసినా దొరకని పెన్నిధి అది. మనందరిభాగ్య విశేషంచేత మనకు లభించింది. మీరింకేమి కోరనక్కరలేదు. ఏమి చేయనక్కరలేదు. ఆయన పాదాలను అచంచల విశ్వాశంతో ఆశ్రయించుకొని ఉండండి. అంతే చాలు. తప్పక తరిస్తారు. చెప్పుడు మాటలు విని, అపోహలలోపడి దూరమైనారా, ఎన్ని జన్మలెత్తినా మళ్ళీ అటువంటి మహాత్ముణ్ణి పొందలేరు జాగ్రత్త !” ఇది శేషగిరిరావుగారు తమ భక్త సోదరులందరి చెవులలో నూరిపోసిన సందేశం.

అంతే కాదు, తమవలె గురుసేవ చేసుకొనే విధంగా తదితర భక్తులకు కూడా శి క్షణ యిచ్చారు. శ్రీబాబు దేవతార్చన సమయంలో దగ్గర ఉండి చేసుకోవలసిన సేవలను, విధులను, తుని లక్ష్మికి చక్కగా నేర్పారు. ఈ విధంగా శ్రీ బాబు సేవ,గురు కార్యము చక్కగా నిరాఘాటంగా కొనసాగే ఏర్పాటు చేసుకొని, శ్రీ శేషగిరిరావుగారు శ్రీ గురుదేవులలో స్వరూప లయం పొందారు.

*

ఒకడు కలగంటున్నాడు. కలలో ఘట సర్పము వాణ్ణి పట్టుకుంది. వాడు పెడ బొబ్బలు పెడుతున్నాడు. ఆ సమయంలో వాడికి మందు వేయలా? మంత్రవేత్త కావాలా? ఏదీ అక్కర్లేదు. మేలుకొలిపితే సరిపోతుంది. అట్లే అజ్ఞానంలో పడని మానవుడు వివిధ విచిత్ర స్వప్నాలు కంటున్నాడు. వాణ్ణి గురువు ప్రబోధించి, నిద్రలేపితే చాలు.

భగవంతునితో తప్ప, ఆత్మజ్ఞానంతో తప్ప అహంకారం సృష్టిలోని మరియే యితర వస్తువుతో చావదు. అహంకారమే పరమాత్ముడికీ జీవాత్ముడికీ మధ్య అడ్డుతెర. అహంకార గ్రంధి విడక జ్ఞాని కాబోడు. అహంకార వాతావరణం తొలగక, భక్తుడు కాబోడు.

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

### శ్రీరమణ మహర్షి

సమస్త ధరామండలం జలప్రళయంలో మునిగి పోతుంటే పరమేశ్వరుడు ఒక చిన్న భూభాగాన్ని త్రిశూలంతో ఎత్తి పెట్టారు. ఆ ఊరే 'తిరుచ్చుళి' (సంస్కృతంలో త్రిశూలపురం). శివతనయుడైన కుమారస్వామి లోక సంరక్షణార్థమై తిరుచ్చుళిలో అలగమ్మ సుందరమయ్యర్ పుణ్యదంపతుల గర్భంలో అవతరించాడు. 1879 డిశంబరు30న అలగమ్మ గర్భంనుంచి ఒక ధవళతేజస్సు



ఉదయించి ఒక బాలుని ఆకృతి ధరించింది. తల్లిదండ్రులు ఆ బాలునికి "వెంకట్రామన్" అని పేరు పెట్టారు. ఆ బాలుడే "భగవాన్ రమణమహర్షి" అనే కళ్యాణనామంతో లోక పూజ్యులయ్యారు.

వెంకట్రామన్ బాల్యం సాధారణంగా గడిచింది. అతనికి చదువు కంటే ఆటపాటలపై అనురక్తి ఎక్కువగా ఉండేది. అయితే అతను ఏక సంతాగ్రాహి. వెంకట్రామన్‌కి పసితనం నుంచి 'అరుణాచలం' అంటే సాక్షాత్ భగవంతుడు అనే భావం కుదిరింది. మధురలో విద్యాభ్యాసం చేశాడు. పెరియపురాణం, శివభక్త విజయం దివ్యావేశంతో పఠించాడు.

వెంకట్రామన్ ఒక బంధువుని ఇలా ప్రశ్నించాడు "తాతా! ఎక్కడనుండి వస్తున్నావు" అని

"అరుణాచలం నుండి"

అరుణాచలం నుండి రావడమేమిటి? అరుణాచలం అంటే భగవంతుడే కదా! భగవంతుడి నుండి రాక పోకలు సాధ్యమా" అని ఆలోచనలో పడ్డాడు.

అరుణాచలం అంటే తిరువణ్ణామలైలో ఉన్న కొండ తెలుసా? అన్నాడు. అరుణాచలాన్ని భగవంతుడిగా భావిస్తున్న వెంకట్రామన్‌కి అరుణాచలం

'కొండ' అనగానే నమ్మలేకపోయాడు. తన అనుభవంలో అది అనుగ్రహరూపమైన పరమాత్మ అని తెలుసుకున్నాడు.

వెంకట్రామన్ 17 సంవత్సరాల ప్రాయంలో ఎట్టి జపాలు, సాధనలు, గురూపదేశం లేకుండా కొన్ని క్షణాలలో మోక్ష సామ్రాజ్యాన్ని పొందాడు.

శ్రీరమణులు ఈ విషయం గురించి ఇలా చెప్పారు "నేను మధురలో ఒంటరిగా మేడమీద గదిలో కూర్చున్నాను. మంచి ఆరోగ్యంగా ఉన్నాను. హఠాత్తుగా నన్ను మృత్యువు దుమికి కబళించి వేస్తోంది. నాకు ఎట్టి భయమూ కలుగలేదు. మృత్యువు అంటే ఏమిటి? చనిపోయేది ఎవరు? అనే ప్రశ్నలు ఉదయించాయి.

"కొన్ని క్షణాలలో మృత్యువు శరీరాన్ని పూర్తిగా లోగొన్నది. రక్తప్రసరణ, ఉచ్ఛ్వాస నిశ్వసాలు, ప్రాణ స్పందన పూర్తిగా నిలిచిపోయాయి. శరీరం శవమైంది. కాని ఆశ్చర్యం! "నేను నేను" అను స్ఫూర్తిని అనుభవిస్తూనే వున్నాను. చనిపోయిన శరీరాన్ని సాక్షిగా చూస్తున్నాను. అప్పుడు ఇలా తలచాను......

"ఈ శరీరం శవమైంది. దానిని నలుగురు శ్మశానానికి తీసుకు వెళ్ళి బూడిద చేస్తారు. అంతటితో ఈ శరీర గతమైన కథ ముగుస్తుంది. చనిపోయేది శరీరం. "నేను" కు మృత్యువు లేదు. "నేను" శరీరం కాదు అని అనుభవ పూర్వకంగా గ్రహించాను."

హటాత్తుగా చీకటి వెలుతురుగా మారినట్లు మర్త్యుడైన వెంకట్రామన్ మృత్యువుకు ఎదురొడ్డి మృత్యుంజయుడై అవతరించాడు. ఈ సంఘటన శ్రీ రమణుని అపూర్వతని, దైవత్వాన్ని తెలుపుతోంది.

ఒకరు శ్రీ అరవిందులను "ప్రతి వారికి గురువు ఉండాలి అంటున్నారు. శ్రీరమణునికి గురువేరి?" అని ప్రశ్నించారు. శ్రీ అరవిందులు "యోగ సామ్రాట్టులైన శ్రీరమణుని వంటి వారికి గురువు అవసరం లేదు" అని చెప్పారు.

– సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL